


మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. షేర్, సబ్‌స్క్రైబ్, లైక్.

https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY



సంపుటి 11 | సంచిక 93 | కర్నూలు | గురువారం 14-05-2026

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi


# అమరావతితో పాటే విశాఖ అభివృద్ధి

**అక్కడ ఇప్పటికే అనేక సంస్థలు రాక**
**టెక్నాలజీ హబ్‌గా రాయలసీమ**
**తిరుపతిలో ఏరోస్పేస్ సిటీ అభివృద్ధి**
**కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు**
**కిమ్స్ ఆసుపత్రి శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు**



అమరావతి,మే13 (శ్రీచక్ర) : అభివృద్ధి విషయంలో ఒక్క అమరావతిపైనే శ్రద్ధ పెట్టట్లేదని.. విశాఖనూ విశ్వనగరంగా చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖను ఐటి పరంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే అనేక ప్రాజెక్టులు అక్కడ వచ్చాయని అన్నారు. రాజధాని ప్రాంతంలో కిమ్స్ ఆసుపత్రి, వైద్య విశ్వవిద్యాలయం నిర్మాణానికి బుధవారం సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 'రాయలసీమను రతనాల సీమగా మారుస్తున్నాం. ఆ ప్రాంతానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ఏరో స్పేస్ హబ్‌గా అనంతపురం మారబోతోంది. రాయలసీమ 'టెక్నాలజీ హబ్'గా తయారవుతోంది. తిరుపతిలో ఏరో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు కాబోతున్నాయి. శ్రీసిటీ.. ఇండస్ట్రియల్ హబ్‌గా తయారైందని వివరించారు. ఇకపోతే కిమ్స్ అధినేత భాస్కర్‌రావు ఒక విజన్ ఇచ్చారు. 2027 మే 13న కిమ్స్ ఆసుపత్రిని ప్రారంభిస్తాం అన్నారు. 2028 ఆగస్టు 15 కంటే ముందే విశాఖలో గూగుల్ తన కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. 2028 డిసెంబరులోపు ఫేజ్-1 పూర్తి చేయాలని ఆర్సెల్లార్ మిత్తల్‌కు ఆదేశాలు ఇచ్చాం. ఎలాంటి అనుమతులు కావాలన్నా త్వరగా ఇస్తాం. లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తాం. వైద్యులు కూడా ఏఐని నేర్చుకుంటున్నారు. లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేదే మా ప్రభుత్వ ఆలోచన. ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఇక్కడి నుంచే ఉండాలి. డిసెంబరు నాటికి భారత్‌లో క్వాంటం కంప్యూటింగ్‌కు చిరునామాగా అమరావతి అవుతుందని చంద్రబాబు అన్నారు. విదేశాలపై ఆధారపడకుండా గ్రీన్ ఎనర్జీని మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. ప్రతి పొలంలో, ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ లాంటి విద్యుదుత్పత్తి కేంద్రాలు తీసుకొస్తాం. పశ్చిమాసియా యుద్ధం వల్ల పెట్రోల్, గ్యాస్, డీజిల్ కొరత వచ్చింది. భవిష్యత్తులో వర్క్‌ఫ్రమ్ హోం వస్తుంది.. ప్రభుత్వంలో కూడా తీసుకొస్తాం. 10 కార్లతో కాన్వాయ్‌గా రావడం ఫ్యాషనైంది.. సెక్యూరిటీ అర్థవంతంగా ఉండాలి. హాలిడే వస్తే విదేశాలకు వెళ్తున్నారు. మంచి పర్యాటక ప్రదేశాలు మన దేశంలోనే ఉన్నాయి. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. గోవాను మించిన టూరిజం కేంద్రంగా సూర్యలంక మారుతుందని సీఎం అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ పొదుపు పిలుపు ఆవశ్యం

**మనం కూడా ఆచరించి భాగస్వాములం అవ్వదాం**
**కాన్వాయ్‌లు, భద్రతా సిబ్బందిని కుదించుకుందాం**
**నిడమర్రులో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు**



అమరావతి,మే13 (శ్రీచక్ర) పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల వల్ల దేశంపై పలు విధాలుగా భారం పడుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధాని ప్రకటించిన 8 పొదుపు సూచనలు పాటించాలని ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. మరో రెండు రోజుల్లో ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ పరంగా కూడా ఓ కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు, ప్రజలు కూడా బాధ్యతగా ఉండాలని సూచించారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు 8 సూచనలను మనం పాటించాలని.. తాత్కాలికంగా వచ్చే ఇబ్బందులను అధిగమించాలని దిశానిర్దేశర చేశారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన పొదుపు సూచనలపై సీఎం స్పందించారు. నిడమర్రులో సీఎం చంద్రబాబు బుధవారం పర్యటించారు. కిమ్స్ ఆస్పత్రికి భూమి పూజ చేశారు. బైసర్ స్కిల్ వర్సిటీ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, అమలాపురం ఎంపీ హరీశ్ బాలయోగి, మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలని.. దీని వల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు.

# నేడు ఎపి కేబినేట్ భేటీ

**పలు కీలక అంశాలపై చర్చ**



అమరావతి,మే13(శ్రీచక్ర) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం కేబినెట్ భేటీ జరగనుంది. ఉదయం 10:30 గంటలకు ఏపీ సచివాలయంలో మంత్రిమండలి సమావేశం కానుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు పిలుపు, చర్యలపై సీఎం, మంత్రులు ప్రత్యేకంగా చర్చించనున్నారు. అనంతరం దీనిపై అధికారులు, మంత్రులకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేసే అవకాశం కనిపిస్తోంది.ఏపీలోని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ అంశంపైనా మంత్రివర్గంలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. 17వ ఎస్ఐపీబీ ఆమోదించిన పలు అంశాలపైనా చర్చించి ఆమోదం తెలపనున్నారు. మొత్తం 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,01,023 కోట్ల పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. విశాఖలో రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్‌కు మంత్రిమండలి ఆమోదం తెలపనుంది. సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్‌కు ఆమోదం ఇవ్వనుంది. కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ గ్రూప్ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేయనుంది. తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్రవాహన తయారీ పరిశ్రమకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. పలు కీలక సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించి సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి ఆమోదం తెలపనుంది.


# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు..

**రైతులు, రైల్వేలు, పరిశ్రమలకు భారీ ఊతం**

ఢిల్లీ, మే 13 (శ్రీచక్ర) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై కేంద్రమంత్రులతో ప్రధాని చర్చించారు. ఈ భేటీలో పలు నిర్ణయాలకు ఆమోదం లభించింది. ఈ సమావేశంలో పశ్చిమాసియా సంక్షోభం, పెరుగుతున్న గ్లోబల్ ఆయిల్ రేట్స్, ఇంధన సంరక్షణ, వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ క్లాసెస్, బంగారం కొనుగోళ్ల వాయిదాపై చర్చించినట్లు సమాచారం. అలాగే, ఖరీఫ్ సీజన్ మద్దతు ధరల నుంచి కోల్ గ్యాసిఫికేషన్, రైల్వే ప్రాజెక్టులు, విమానాశ్రయ ఆధునికీకరణ వరకు భారీ కేటాయింపులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.దేశవ్యాప్తంగా రైతులకు మద్దతుగా ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరల (ఓూఖ) అమలుకు కేంద్ర కేబినెట్ రూ.2,60,000 కోట్ల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా రైతులకు పంటలకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు వ్యవసాయ రంగానికి ఆర్థిక భరోసా లభించనుంది.

పెంచిన ధరలివే..

ఖరీఫ్ పంటలకు మద్దతు ధర పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆయా పంటలకు క్వింటాకు పెంచిన రేట్లు ఇలా ఉన్నాయి.
వరి (సాధారణ రకం) - రూ.2441వరి (గ్రేడ్ ఏ) - రూ.2461హైబ్రిడ్ జొన్నలు - రూ.4023మల్దండి జొన్నలు - రూ.4073సజ్జలు - రూ. 2900రాగులు - రూ.525మొక్కజొన్న - రూ. 2410కందులు - రూ. 8450పెసర్లు - రూ.8780మినుములు - రూ.8200పత్తి (మధ్యరకం) - రూ.8267పత్తి (లాంగ్ రకం) - రూ. 8667వేరుశనగ - రూ.7517పొద్దుతిరుగుడు - రూ.8343సోయాబీన్ - రూ.5708



నువ్వులు - రూ.10,346ఒడిసలు - రూ.10,052కోల్ గ్యాసిఫికేషన్ పథకానికి రూ.37,500 కోట్లు..దేశంలో బొగ్గు వినియోగాన్ని ఆధునికీకరించేందుకు కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు రూ.37,500 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా దిగుమతి ఇంధనాలపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు దేశీయ పరిశ్రమలకు మద్దతు లభించనుంది.గుజరాత్‌లో సర్కేజీ - ధోలేరా మధ్య సెమీ హైస్పీడ్ డబుల్ రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రూ.20,065 కోట్ల వ్యయాన్ని కేటాయించింది. రైల్వే కనెక్టివిటీ మెరుగుపడి పారిశ్రామిక అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.మహారాష్ట్రలోని నాగపూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆధునికీకరించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కొత్త సదుపాయాలు, విస్తరణ పనులతో విమానాశ్రయ సేవలు మరింత మెరుగుపడనున్నాయి. దీని ద్వారా ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.ఈ నిర్ణయాలతో వ్యవసాయం, రైల్వేలు, ఇంధన రంగం, విమానయాన రంగాలకు భారీ ప్రోత్సాహం లభించనుంది. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

# కస్టోడియల్ టార్చర్ కేసు

**జగన్‌ను వదిలే ప్రసక్తి లేదు**
**డిప్యూటీ స్పీకర్ రఘురామ**

భీమవరం,మే13(శ్రీచక్ర) :వైసీపీ హయాంలో తనపై నమోదైన కస్టోడియల్ టార్చర్ కేసును వదిలే ప్రసక్తే లేదని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, తెలుగుదేశం పార్టీ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. ఈ కేసుపై తాను పట్టువదలని విక్రమార్కుడిలా న్యాయం కోసం ప్రయత్నిస్తున్నానని వ్యాఖ్యానించారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లాలో రఘురామ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గురువారం తన పుట్టినరోజు అని.. తన కేసు రేపటికి ఐదేళ్లు అవుతుందని తెలిపారు. తన కేసులో మూడో ముద్దాయిగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని ప్రస్తావించారు. మొదటి ముద్దాయి విచారణకు రాయల్‌గా వచ్చి రాయల్‌గా వెళ్లిపోయారని రఘురామ విమర్శించారు. రెండో ముద్దాయిని, మూడో ముద్దాయిని ఇంకా విచారణకు ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఈ కేసులో జగన్ రెడ్డి, సునీల్ కుమార్ పేర్లు ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం చంద్రబాబు చెప్పారని అన్నారు. పోలవరంతో పాటు తన కస్టోడియల్ టార్చర్ కేసును కూడా పూర్తి చేస్తారనే నమ్మకం తనకు ఉందని చెప్పుకొచ్చారు. తనపై మహాసేన రాజేశ్ పెట్టిన పోస్టును చూశానని తెలిపారు. జగన్ రెడ్డిని ఇప్పటివరకు తాను ఎందుకు ప్రశ్నించలేదని రాజేశ్ అడిగారని చెప్పారు. ఈ విషయంపై ఆయనతో మాట్లాడతానని అన్నారు. జగన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే ఆయన చేసిన దారుణాల గురించి తాను మాట్లాడానని చెప్పుకొచ్చారు. రచ్చబండ ద్వారా జగన్ రెడ్డిని ఓడించే వరకు మాట్లాడానని తెలిపారు. ఎన్నికల్లో జగన్ దారుణంగా ఓడిపోయారని విమర్శించారు. ఇంకా జగన్ గురించి తాను మాట్లాడేది ఏముందని రఘురామ ప్రశ్నించారు.

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

**తమిళనాడు అసెంబ్లీలో 144 మంది మద్దతు**
**విశ్వాస పరీక్షను బహిష్కరించిన డిఎంకె**
**అన్నాడిఎంకె చీలిక వర్గం టివికెకు అనుకూల ఓటు**
**ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సిఎం విజయ్**



చెన్నై,మే13(శ్రీచక్ర) : తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎమ్ఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాసపరీక్షను బహిష్కరించింది. పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బలపరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్యెల్యేల తరపున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం.

# సంపాదకీయం

## మోడీ గోల్డన్ స్ట్రోక్...

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థను ఊపిరి ఆడనివ్వకుండా చేస్తోంది. పెరుగుతున్న నిర్మాణ వ్యయం, ముడిసరుకు కొరత, విదేశీ మారక నిల్వలపై పడుతున్న భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అత్యంత కఠినమైన నిర్ణయాల వైపు అడుగులు వేస్తోంది. మరో వైపు కేంద్రం బంగారం విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. బంగారం, వెండి, ప్లాటినం దిగుమతుల మీద సుంకం రెట్టింపు చేసింది. ఇప్పటిదాకా అది ఐదు శాతం మాత్రమే ఉండేది. ఇప్పుడు ఏకంగా 10 శాతానికి పెరిగిపోయింది. ఇది మంగళవారం అర్థరాత్రి నుంచి అమల్లోకి వచ్చింది. ఆభరణాల తయారీకి వాడే వస్తువులు.. ఇతర లోహాలు.. పారిశ్రామిక దిగుమతులకు కూడా ఇది వర్తిస్తుంది. దీంతో దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.. ఇప్పటికే బంగారం ధర (24 క్యారెట్లు) 1,40,000 మించి ట్రేడ్ అవుతోంది. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఆ ధర మరింత పెరిగే అవకాశం ఉంది.బంగారం దిగుమతులు పెరుగుతుండడం కేంద్ర ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ధరలు పెరుగుతున్నప్పటికీ చాలామంది బంగారం మీద ఇన్వెస్ట్ చేస్తున్నారు. మార్కెట్ నిపుణులు కూడా బంగారం మీద ఇన్వెస్ట్ చేయాలని సూచనల మీద సూచనలు చేస్తున్న నేపథ్యంలో.. చాలామంది ఇతర రంగాలను పక్కనపెట్టి.. కేవలం బంగారం మీద మాత్రమే ఇన్వెస్ట్ చేస్తున్న నేపథ్యంలో.. ఇతర రంగాలలో కొనుగోళ్లు పూర్తిగా తగ్గిపోయాయి. దీంతో ఆయా రంగాలలో ఆర్థికంగా అభివృద్ధి అంతగా సాగడం లేదు. అందువల్లే కేంద్రం ఈ నిర్ణయం తీసుకొని ఉంటుందని తెలుస్తోంది. బంగారం కొనుగోళ్లు ఏడాదిపాటు తగ్గిపోతే మన దేశానికి సంబంధించిన విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరుగుతాయని కేంద్రం అంచనా వేస్తోంది.కేవలం బంగారం, ఇతర ఖరీదైన లోహాలు మాత్రమే కాదు.. ఆహార పదార్థాల ధరలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. దేశంలో ఏప్రిల్ నెలకు సంబంధించి రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా నాలుగు నెలల గరిష్టానికి చేరుకుంది. నాలుగు నెలల క్రితం ఇది 3.48 శాతంగా ఉండేది. జనవరిలో 2.74 శాతంగా ఉండేది. దీనికి ప్రధాన కారణం ఆహార ధరల పెరుగుదలే. వరుసగా ఆలు.. ఉల్లి.. టమాటా ధరలు క్రాష్ అయ్యాయి. మిగతా ఉత్పత్తుల ధరలు పెరిగాయి. దీంతో నాలుగు నెలల్లో ఆహార ద్రవ్యోల్బణం గడిచిన నాలుగు నెలల్లో 2.13 శాతం నుంచి 4.2 శాతం వరకు పెరిగింది. జ్యువెలరీ, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్స్ వంటి వాటిపై ఏప్రిల్ లో ద్రవ్యోల్బణం 53.61 శాతానికి చేరుకుంది. దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నిర్మాణ పనులను రెండేళ్ల పాటు నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సిఫార్సు చేయడం ఇప్పుడు సంచలనంగా మారింది.నీతి ఆయోగ్ సిఫార్సుల ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెంట్రల్ సెక్రటేరియట్ పునర్నిర్మాణ పనులను కూడా ప్రస్తుతానికి వాయిదా వేయనున్నారు. నిర్మల్ భవన్, ఉద్యోగ్ భవన్ వంటి భవనాల కూల్చివేత, కొత్త నిర్మాణాలను వాయిదా జాబితాలో చేర్చారు. యుద్ధం కారణంగా స్టీల్, సిమెంట్ వంటి ముడిసరుకుల సరఫరాలో అంతరాయం కలగడం, దిగుమతి ఖర్చులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.ప్రస్తుత ఆర్థిక అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు కీలక విన్నపం చేశారు. విదేశీ వస్తువుల వాడకాన్ని తగ్గించి, స్వదేశీ వనరులపై ఆధారపడాలని కోరారు. ముఖ్యంగా ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు పాఠశాలలకు ఆన్‌లైన్ తరగతులను నిర్వహించాలని సూచించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కోవిడ్ కంటే భయంకరమైన సంక్షోభం ఇదని ప్రధాని వ్యాఖ్యానించడం తీవ్రతకు అద్దం పడుతోంది. నీతి ఆయోగ్ ప్రతిపాదనలు, యుద్ధ ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. సెన్సెక్స్ ఏకంగా ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు మండుతుండటంతో భారత రూపాయి విలువ ఆల్ టైమ్ లో 95.28 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది సామాన్యులపై నిత్యావసర వస్తువుల ధరల భారం పెంచే ప్రమాదం ఉంది.మరోవైపు, ప్రభుత్వ నిర్ణయాలపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తున్నాయి. నిర్మాణ రంగం ఆగిపోతే లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతారని, ఆన్‌లైన్ క్లాసుల వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నాయి. ఒక దేశం వద్ద ఉన్న విదేశీ మారకద్రవ్యం, బంగారం, ఇంటర్నేషనల్ మానిటరింగ్ ఫండ్ వద్ద ఆదేశానికి సంబంధించిన కరెన్సీ హక్కులు, ఐఎంఎఫ్ లో సభ్యత్వం తీసుకున్నప్పుడు.. ఆ దేశం రిజర్వ్ చేసిన సొమ్ములో 25 శాతం. ఇలా ఈ నాలుగింటిని కలిపి విదేశీ మారక ద్రవ్య నిల్వలు అని పిలుస్తుంటారు.. ఇవి ఒక దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంటాయి. వీటిని అంచనా వేసి ఆ దేశం ఆర్థికంగా ఏ స్థాయిలో ఉందో అన్ని పనులు అంచనా వేస్తారు..మూడీస్, ఎస్ అండ్ పీ, ఫిచ్ వంటి సంస్థలు ఫారెక్స్ రిజర్వ్ అధికంగా ఉన్న దేశాలకు అద్భుతమైన రేటింగ్ ఇస్తాయి. ఈ రేటింగ్ గనక అధికంగా ఉంటే.. ఆదేశాలకు తక్కువ వడ్డీకి అప్పులు లభిస్తుంటాయి. ఉదాహరణకు మనం లోన్ కోసం బ్యాంకు దగ్గరికి వెళ్తే.. మన సిబిల్ స్కోర్ చూస్తుంటారు. అది బాగుంటే బ్యాంక్ అధికారులు లోన్ వెంటనే మంజూరు చేస్తుంటారు. ఇదే విధానాన్ని దేశాలకు కూడా అప్పులు ఇచ్చే సంస్థ పాటిస్తుంటాయి.ఒక దేశంలో విదేశీ మారక ద్రవ్య నిల్వలు తగ్గిపోతున్నాయంటే.. విదేశీ పెట్టుబడిదారులు తాము పెట్టిన ఇన్వెస్ట్మెంట్ మొత్తాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు లెక్క. ఒక దేశానికి సంబంధించి ఏడు నుంచి పది నెలల వరకు క్రూడ్ ఆయిల్ కొనుగోలు చేయడానికి డబ్బులు ఉంటే.. ఆ దేశానికి సంబంధించిన పరపతి బాగున్నట్టు లెక్క. ఇప్పుడున్న పరిస్థితుల్లో మనదేశ విదేశీ మారకద్ర నిల్వలు బాగానే ఉన్నాయి.

# ఓర్వకల్లును పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

**మంత్రి టీజీ భరత్ గుప్తా చేతుల మీదుగా శ్రీ మాత్రే ఫుడ్స్ గ్రీన్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ శంకుస్థాపన**

**రూ.10 కోట్ల పెట్టుబడులతో కర్నూలులో ఆధునిక గ్రీన్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు**

**ఓర్వకల్లుకు రూ.50 వేల కోట్ల పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యం - మంత్రి టీజీ భరత్ గుప్తా**





కర్నూలు, మే 13 (శ్రీచక్ర): శ్రీ మాత్రే ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తమ ప్రతిష్టాత్మక గ్రీన్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు మే 13, 2026న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా బ్రహ్మణపల్లె సమీపంలోని గుట్టపాడు ఓ‌ఎఇ పార్క్‌లో ఘనంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు మరియు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి. భరత్ గుప్తా, జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పి. సుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అతిథి విశిష్టులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ, శ్రీ మాత్రే ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం 8 నెలల్లోపు నిర్మాణ పనులు పూర్తి చేసేలా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో కొత్త కంపెనీలు రావడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఇప్పటికే ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ప్లాంట్‌ను రిలయన్స్ కంపెనీ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఓర్వకల్లులో నీటి సమస్య లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం మరియు బ్రాండ్ ఇమేజ్ కారణంగా రాష్ట్రానికి భారీగా పరిశ్రమలు వస్తున్నాయని చెప్పారు. ఓర్వకల్లుకు సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడులు తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. మంచి నాయకత్వం ఉంటే పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. రానున్న రోజుల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్ ద్వారా వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఇక్కడ అన్ని రకాల పరిశ్రమలు స్థాపించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఆయన తెలిపారు.×పరిశ్రమల హబ్‌గా ఓర్వకల్లు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిపాణ్యం శాసనసభ్యులు గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రివర్యుల నాయకత్వంలో రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు, పరిశ్రమలు ఆకర్షితమవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాకు అనేక ప్రతిష్టాత్మక పరిశ్రమలు రావడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ 20 నెలల కాలంలో రాష్ట్రానికి సుమారు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడంలో కూటమి ప్రభుత్వం విజయవంతమైందని తెలిపారు. కర్నూలు జిల్లాలో డ్రోన్ హబ్, అగస్త్య ఇండస్ట్రీస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎంఎస్ఎంఈ పార్కులు, షిగాచి పరిశ్రమలు స్థాపన దిశగా ముందుకు సాగుతున్నాయని, తాజాగా శ్రీ మాత్రే ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు శంకుస్థాపన జరగడం మరో ముఖ్యమైన ముందడుగని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే కాకుండా, ప్రత్యేకంగా ఓర్వకల్లును పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ పరిశ్రమల ద్వారా స్థానికంగా చదువుకున్న యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. కర్నూలు జిల్లా, ముఖ్యంగా ఓర్వకల్లుకు ఇంత పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడం ఎంతో సంతోషకరమని తెలిపారు. పక్క రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టాలనుకున్న పరిశ్రమ యాజమాన్యాలు కూడా కూటమి ప్రభుత్వం పరిశ్రమలకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, పారదర్శక విధానాలు చూసి ఓర్వకల్లులోనే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ముందుకు వస్తున్నాయని వెల్లడించారు. మన జిల్లాకు చెందిన పారిశ్రామిక వేత్తలు స్థానిక యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ పరిశ్రమలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఓర్వకల్లులో మరిన్ని భారీ పరిశ్రమలు స్థాపితమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే కర్నూలు జిల్లాకు నిరంతరం పరిశ్రమలు తీసుకురావడానికి కృషి చేస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీ మాత్రే ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పి. వేదవ్యాస్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో పర్యావరణ హిత విధానాలను అనుసరిస్తూ విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులను తయారు చేసే గ్రీన్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సంస్థ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓ‌ఎఇ పార్క్‌లో 5.96 ఎకరాల భూమిని కేటాయించిందని, ఏడాది లోపే మొదటి దశ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన వెల్లడించారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో పలు దశల్లో సుమారు రూ.10 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపారు. స్థానికంగా పండే అరటి, జామ, పండ్ల గుజ్జు (ఫ్రూట్ పల్ప్) మరియు ఇతర పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్‌పై ఈ యూనిట్ ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు చెప్పారు. దీని ద్వారా స్థానిక రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 25 మందికి ప్రత్యక్ష ఉపాధి, వందలాది మంది రైతులు మరియు అనుబంధ రంగాల వారికి పరోక్ష ఉపాధి అవకాశాలు కలుగనున్నాయని తెలిపారు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి మరియు వ్యవసాయ విలువ శ్రేణి బలోపేతానికి దోహదపడుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో సహకరిస్తున్న గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి టి. జి. భరత్, ఎమ్మెల్యే శ్రీమతి చరితా రెడ్డి మరియు అధికారులకు వేదవ్యాస్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఫుడ్ ప్రాసెసింగ్ విధానం, ఓ‌ఎఇ ప్రోత్సాహక కార్యక్రమాలు పరిశ్రమల అభివృద్ధికి మరియు యువ పారిశ్రామికవేత్తలకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని వ్యవసాయ రంగ సామర్థ్యాన్ని గుర్తించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు మద్దతు ఇవ్వడం ద్వారా స్థానిక వ్యవసాయ ఉత్పత్తులను అధిక విలువ కలిగిన ఉత్పత్తులుగా మార్చే అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు.అనంతరం శ్రీ మాత్రే ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు శంకుస్థాపన చేసి, భూమి పూజ నిర్వహించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అధికారి అశోక్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**57 సెంటర్లలో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు.:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**






కర్నూలు, మే 13 (శ్రీచక్ర): మే 21 వ తేది నుండి జూన్ 4వ తేది వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను 57 సెంటర్లలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబధిత అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 21 వ తేది నుండి జూన్ 4 వ తేది వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను 57 సెంటర్లలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మొదటి సంవత్సరం నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 15,835 మంది జనరల్ విద్యార్థులు, 1815 మంది ఒకేషనల్ కోర్సు కు సంబంధించిన విద్యార్థులు మొత్తం 17,650 మంది విద్యార్థులు వ్రాస్తున్నారని, 2 వ సంవత్సరానికి సంబంధించి 7,374 మంది జనరల్ విద్యార్థులు, 775 మంది ఒకేషనల్ కోర్సు కు సంబంధించిన విద్యార్థులు మొత్తం రెండో సంవత్సరానికి 8,149 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాస్తున్నారన్నారు, ఈ పరీక్షల నిర్వహణకు ఆయా శాఖల అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.. ప్రశ్న పత్రాలను ఆయా పరిధిలోని పోలీస్ స్టేషన్లో భద్రపరచడం జరుగుతుందని, ప్రశ్నపత్రాలను పరీక్షకేంద్రాల వద్దకు ఎస్కార్ట్ తో తీసుకొని వెళ్లాలని, ఉదయం పరీక్షల నిర్వహణ అనంతరం ఎస్కార్ట్ తో పోస్ట్ ఆఫీస్ వద్దకు తీసుకొని వెళ్లి పోస్టల్ ద్వారా పంపించవలసి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ వారు పరీక్ష కేంద్రాల వద్ద త్రాగునీటి సదుపాయం కల్పించాలని, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూడాలని కలెక్టర్ మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలయ్యేలా చూడాలని, పరీక్ష కేంద్రాల నిర్వహణలో ఫ్లేయింగ్ స్క్వాడ్ లో ఇద్దరు రెవిన్యూ అధికారులు ఉండేలా చూడాలని కలెక్టర్ రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా సరిపడే బస్సులు సంబంధిత రూట్ లలో తిరిగేలా చూడాలని కలెక్టర్ ఏపీఎస్ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని అదే విధంగా వైద్య సిబ్బంది కూడ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో విద్యుత్ అంతరాయంలేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్ లను మూయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, ఆర్ఐఓ లాలప్ప, కర్నూలు నగరపాలక సంస్థ అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ, కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఏపీఎస్పీడీసీఎల్ డిఈ విజయ భాస్కర్, ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

# గూడ్స్ వాహనాలలో ప్రయాణికులను ఎక్కించరాదు-మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు



మంత్రాలయం , మే 13, (శ్రీచక్ర) : గూడ్స్ వాహనాలలో ప్రయాణికులను ఎక్కించరాదని మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు అన్నారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలో మాధవరం ఎస్ఐ విజయకుమార్ తో కలిసి మాధవరం చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని ,అలా చేస్తే చట్ట ప్రకారం జైలు శిక్ష మరియు జరిమానా విధించడం జరుగుతుందని వాహనదారులకు హెచ్చరించారు. గూడ్స్ వాహనాలలో పలకలు అమర్చి వాటిపై ప్రయాణికులను రవాణా చేస్తే వాహానాలు సీజ్ ,యంవీ యాక్ట్ మేరకు జరిమానాలు విదించబడుతాయన్నారు.

# ఎరువుల దుకాణాలు అకస్మిక తనిఖీ



మంత్రాలయం , మే 13,(శ్రీచక్ర) : మంత్రాలయం మండల పరిధిలోని కాచాపురం, మాధవరం గ్రామంలో ఉన్న ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి జీరాగణేష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మకాలు చేసిన ఎరువుల యొక్క రైతుల వివరాలను సమర్పించాలని దుకాణదారులకు సూచించారు. రైతులు వారి భూమి సాగు వివరాలు నమోదు చేసుకుని రైతులు యొక్క అవసరం మేరకు వారి కోరిన ఎరువుల డిబిటి పద్ధతి ద్వారా నమోదు చేసుకుని అమ్మకాలు జరపాలన్నారు. మండలంలో 270మీ మేర యూరియా నిల్వలు కలవు అన్నారు. రైతులు పంటలకు అవసరం మేరకే వాడాలని సూచించారు. ఎరువుల గురించి చిందిచాల్సిన అవసరం లేదన్నారు.

# జాతీయ స్థాయిలో కర్నూలు క్రీడాకారులు రాణించాలి : డాక్టర్. శంకర్ శర్మ

కర్నూలు స్పోర్ట్స్,, మే 13 (శ్రీ చక్ర ): కర్నూలులో క్రీడలు అభివృద్ధి చెందడం ఎంతో సంతోషంగా ఉందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ తెలిపారు. కర్నూలు లో వేసవి శిక్షణ తరగతులు క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 80 శిబిరాలు ఏర్పాటు చేశారు. అవుట్ డోర్ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు డాక్టర్. శంకర్ శర్మ పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్. శంకర్ శర్మ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధి కోసం మంత్రి టీజీ. భరత్, మాజీ ఎంపీ టీజీ. వెంకటేష్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. వారి కృషి తో పాటు మరికొందరి సహకారంతో కర్నూలు స్పోర్ట్స్ హబ్ గా మారుతుందన్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం, సాయంత్రం మాత్రమే క్రీడలు ప్రాక్టీస్ చేయాలని సూచించారు. విద్యార్థులు మంచి ఆహారంతో పాటు పండ్లు, తీసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. క్రీడల్లో పాల్గొంటే గెలుపు ఓటములను సమానంగా తీసుకునే మనోధైర్యం అలవాటు అవుతుందని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి సం
అధికారి భూపతి రావు
చిన్న సుంకన్న, శిరీష
తదితరులు
పాల్గొన్నారు.



# కర్నూలు సర్వజన ఆసుపత్రి ద్వారా ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించాలి

## 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### రెమిడియల్ క్లాసులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



నంద్యాల, మే 13 (శ్రీచక్ర): పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు హాజర య్యే విద్యార్థులు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని గుర్రాలపేటలో ఉన్న కే.ఎన్.ఎం. మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న రాఅ రెమిడియల్ క్లాసులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక తరగతుల నిర్వహణ విధానం, విద్యార్థుల హాజరు, బోధన పద్ధతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారి చదువుల పురోగతి, సబ్జెక్టుల వారీగా ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా బోధన చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు. ముఖ్యంగా తెలుగు మరియు సైన్స్ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు అదనపు శిక్షణ అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలిసిన మీడియా విలేకరులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 10వ తరగతి ఫలితాల్లో 84 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. అయితే 3,375 మంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని తెలిపారు. వీరిలో కొంతమంది అన్ని సబ్జెక్టుల్లోనూ ఫెయిల్ కావడం ఆందోళనకరమన్నారు. అలాంటి విద్యార్థులు కూడా సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు రెమిడియల్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి విద్యార్థి స్థాయిని గుర్తించి, వారికి అవసరమైన విధంగా సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై దృష్టి పెట్టాలని కలెక్టర్ కోరారు. సప్లిమెంటరీ పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులను సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచి, ఇంటి పనులు చెప్పకుండా చదువుకు అనుకూల వాతావరణం కల్పించాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన మలుపు అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తే జిల్లాలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.

## టీజీ వెంకటేష్ పుట్టిన రోజు సందర్భంగా కాబోయే వధూవరులకు బంగారం పుస్తెలు, పట్టు వస్త్రాలు పంపిణీ



కర్నూలు, మే 13 (శ్రీచక్ర): మాజీ రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని మే ఈ నెల 16 తేదీన వివాహం చేసుకుంటున్న జంటలకు బుధవారం టీజీ వెంకటేష్ స్వగృహంలో పట్టు వస్త్రాలు, కాళీ మెట్టెలు, బంగారు తాళిబొట్టు పంపిణీ చేశారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం 60 జంటలు 16న వివాహంతో ఒక్కటి కానున్నారు. వీరందరికీ మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ సతీమణి టీజీ రాజ్యలక్ష్మి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సతీమణి శిల్పా భరత్ లు ఈ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులకు పట్టు వస్త్రాలను, తాళిబొట్టు, కాళీ మెట్టలు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా 16న ఒక్కటయ్యే వారికి తమ కుటుంబం నుంచి సహాయ సహకారాలు ఉంటాయని ఈ సందర్భంగా వారు తెలిపారు. వివాహం చేసుకుంటున్న ప్రతి జంటకి 80 వేల రూపాయల నగదు, 20 వేల రూపాయల విలువైన తాళిబొట్టు, కాలిమెట్టలతో పాటు పట్టువస్త్రాలు కూడా అందజేస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమం ఇలాగే కొనసాగుతుందని టీజీ కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టివివి ట్రస్ట్ మ్యారేజెస్ కోఆర్డినేటర్లు వాయుగండ్ల సుబ్బారావు, దాశెట్టి శ్రీనివాసులు, విటల్ శెట్టి, ఉమామహేశ్వరరావు, జవహర్ బాబులతో పాటు నూతన వధూవరుల తల్లిదండ్రులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి కి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి.భరత్ గుప్త





కర్నూలు,మే13(శ్రీచక్ర): కర్నూలు సర్వజన ఆసుపత్రి కి కావలసిన అన్ని సౌకర్యాలను సమకూర్చుచున్నామని , ప్రజలకు సంతృప్తికరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి.భరత్ గుప్త.మంగళవారం ఉదయం కర్నూలు మెడికల్ కాలేజీ సమావేశ మందిరంలో మంత్రి భరత్ గుప్త ఆధ్వర్యంలో మెడికల్ కాలేజ్ మరియు సర్వజన ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు విషయాలపై సమీక్షించి సూచనలు జారీ చేశారు. ఈ మధ్య మార్చురీలో డబ్బులు తీసుకుంటున్నారు అన్న విషయం మీడియా ద్వారా తెలిసిందని అన్నారు. ఈ విషయం పై విచారించగా డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తులు మార్చురీలో గత 15 సంవత్సరాల నుండి ప్రభుత్వము నుండి ఎటువంటి జీత భత్యాలు లేకుండా స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారని తెలుసుకున్నారు.వెంటనే వారిని ఔట్సోర్సింగ్ లో పారిశుద్ధ కార్మికులుగా తీసుకొని వారికి జీత భత్యాలు చెల్లించి వారు ప్రజల నుండి సొమ్ము వసూలు చేయకుండా చూడాలని మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రిలో దాదాపు 400 ఏసీలు ఉండగా అందులో 300 చాలా పాతవి తరచూ రిపేర్లు చేయవలసిన అవసరం ఉన్నదని తెలుసుకున్న మంత్రి దశలవారీగా ఆసుపత్రి నిధులతో క్రొత్త వాటిని ఏర్పాటు చేయాలని ఏఎంసీ ద్వారా ఏసీలు మరమ్మతులు చేయించుకోవాలని అవసరమైన మేరకు ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూపరిండెంట్ను ఆదేశించారు. కోవిడ్ సమయంలో ఏర్పాటు చేసిన ఏడు ఆక్సిజన్ ప్లాంట్లను వాడుకులోకి తీసుకుని రావడానికి అవసరమైన ప్రణాళికలు సమర్పించవలసిందిగా ఆదేశించారు.సర్వజన ఆసుపత్రి ఎల్లప్పుడూ పరిశుభ్రముగా ఉండే విధంగా కాంట్రాక్టర్ అధికారులకు సహకరించాలని , అధికారుల సూచనల మేరకు కాంట్రాక్టర్ సిబ్బందిని నియమించి ప్రజల నుండి ఐ విఆర్ఎస్ ద్వారా మంచి ఫీడ్బ్యాక్ వచ్చే విధంగా చర్యలు ఉండాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. నర్సింగ్ సిబ్బంది యొక్క సేవలను సున్నితమైన ప్రదేశాల్లో ఇబ్బంది కలగకుండా స్వల్ప మార్పులు చేర్పులు చేసుకుని వారి ద్వారా రోగుల కు మంచి సేవలు అందించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రికి ఇంకా అవసరమైన వెంటిలేటర్లు , లైఫ్ సపోర్టింగ్ ఎక్విప్మెంట్ , బెడ్లు , ట్రాలీలు మొదలగునవి సమకూర్చుతామని తెలిపారు.ఆసుపత్రిలో ఉన్న జనరేటర్లు ఆటోమేటిక్ గా పనిచేసే విధంగా సమర్థవంతంగా ఉండాలని , 50 సీసీటీవీ ల ద్వారా అన్ని విషయాల పై నిరంతర పర్యవేక్షణ జరుగుతూ ఉండాలని, అన్ని స్కానర్లు ఏఎంసీ వినియోగించుకొని ఎల్లప్పుడు పనిచేస్తూ ఉండాలని ఆదేశించారు. 1956 సంవత్సరంలో నిర్మించిన శుశ్రుత భవన ములో అందించే వైద్య సేవలు వీలైనంత త్వరగా ఐపిడి భవనం కు మార్చే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోగుల సహాయకులకు నిర్మించ తలపెట్టిన విశ్రాం సదన్ త్వరగా కార్యరూపం దాల్చే చర్యలు తీసుకోవాలని , ఆసుపత్రిలో పేరుకుపోయిన కాలం చెల్లిన మందులు వెంటనే తరలించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మరియు మెడికల్ కాలేజీలకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించే విషయాలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలని అధికారులను కోరారు. ప్రజలకు సంతృప్తికరమైన మంచి వైద్య సేవలు అందించి జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలని మంత్రి భరత్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ , జి జి హెచ్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ నాగేశ్వరరావు ,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి , అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం , హాస్పిటల్ డెవోలోప్ కమిటీ మెంబర్ లు డాక్టర్ ప్రవీణ్, సాయి ప్రదీప్ , స్టేట్ క్యాన్సర్ యూనిట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ , ఏపీఎంఐడిసి ఈ ఈ చిరంజీవులు, డిఎంహెచ్వో కామేశ్వర ప్రసాద్ , డెప్యూటీ భాస్కర్ , జిల్లా సర్వైవలెన్స్ ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి , ఎన్టీఆర్ వైద్య సేవ డాక్టర్ భాస్కర్ రెడ్డి , డి ఐ ఓ డాక్టర్ ఉమా,డాక్టర్ లు శివబాల, కిరణ్ మొదలగు వారు పాల్గొన్నారు.

## నదుల స్వచ్ఛత ప్రజలందరి బాధ్యత: కె.సి. కెనాల్ శుభ్రతపై కమిషనర్ సంతృప్తి



కర్నూలు , మే 13 (శ్రీచక్ర): నగర పరిధిలో ఉన్న నదులు, కాలువలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం కె.సి. కెనాల్ ఇరువైపులా పరిసరాలను పరిశీలించిన ఆయన, మంగళవారం ఇచ్చిన ఆదేశాల మేరకు చేపట్టిన శుభ్రత పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. మరింత మెరుగైన పరిశుభ్రత కోసం చర్యలు కొనసాగించాలని అధికారులకు సూచించారు. ప్రజలు అపరిశుభ్రం చేయకుండా ఉండేందుకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతకుముందు 10వ డివిజన్‌లో మస్టర్ తనిఖీ నిర్వహించి, 4వ తరగతి ఉద్యోగుల కాలనీ, గణేష్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. జొహరపురం రోడ్డులోని ఇండోర్ స్టేడియం, మాస్టర్ ఒ బ్లాస్టర్ క్రికెట్ స్టేడియంను సందర్శించి స్వచ్ఛత పనులను చేపట్టాలని ఆదేశించారు.అలాగే గార్బేజ్ ట్రాన్స్‌పోర్ట్ పాయింట్ నిర్మాణం, ఈ-ఆటోస్ పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. సి.క్యాంపు సమీపం లోని సుద్దవాగు పక్కన ఉన్న నగర పాలక సంస్థ స్థలాన్ని సందర్శించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచిం చారు.అనంతరం కలెక్టర్ కార్యాల యం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించి, అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. ఏ.క్యాంపులో రహదారి విస్తరణ కోసం అటవీ శాఖ తొలగించిన మొక్కల ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరితగతిన రహదారి నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు .కార్యక్ర మంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, ఎస్ఈ రమణ మూర్తి, ఏఈ జనార్ధన్, రాంమోహన్, శానిటే షన్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, జిలానీ, హుస్సేన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కో గృహాల్లో అన్ని వసతుల కల్పనకు చర్యలు

### నెలాఖరుకు 500 గృహాల కేటాయింపు

### రెండు నెలల్లో ఇంటింటికి నీటి సరఫరా

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, మే 13 (శ్రీచక్ర): నగర శివార్లలో టిడ్కో గృహాల్లో అన్ని వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం ఆయన టిడ్కో, మున్సిపల్ అధికారులతో కలిసి టిడ్కో గృహాలను పరిశీలించారు. అక్కడి వసతులు, సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. టిడ్కో గృహాల నిర్మాణ స్థితిగతులు, తాగునీటి సరఫరా పనులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో వారంలో 2 సార్లు నీటి సరఫరా చేయడం జరుగుతుందని, విద్యుత్ దీపాలకు మరమ్మత్తులు చేయిస్తామన్నారు. రేషన్ బియ్యం సరఫరా, సచివాలయం, బస్ సౌకర్యం, ప్రాథమిక పాఠశాల వంటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ నెలాఖరుకు 500 గృహాలు అందుబాటులోకి వస్తాయని, రెండు నెలల్లో ఇంటింటికి తాగునీటి సరఫరా పనులు పూర్తి అవుతాయన్నారు. కావున టిడ్కో గృహాలు పొందిన వారు వెంటనే చేరాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, టిడ్కో ఎస్ఈ వి.వి. శేషసాయి, ఎంఈ సూర్యనారాయణ, ఏఈ జనార్ధన్, టిడ్కో అధికారులు పెంచలయ్య, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 15 నుండి ఎల్ఆర్‌యస్ మేళా

### రెండు రోజుల పాటు ఎల్ఆర్‌యస్ దరఖాస్తులకు పరిష్కారం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, మే 13 (శ్రీచక్ర): నగర పరిధిలో అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఎల్ఆర్‌యస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు తమ పెండింగ్ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించుకునేందుకు ఈ నెల15,16తేదీలలో ప్రత్యేకంగా ఎల్ఆర్‌యస్ మేళా నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో రెండు రోజుల పాటు ఈ మేళా నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ఎల్ఆర్‌యస్ దరఖాస్తులకు సంబంధించిన షార్ట్‌ఫాల్ పత్రాలు, ఫీ ఇంటిమేషన్, చెల్లింపులు, అప్రూవల్ ప్రొసీడింగ్స్ వంటి అంశాలను ఒకేచోట పరిష్కరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, భవన నిర్మాణ అనుమతులు, బ్యాంకు రుణాలు పొందడం, ఆస్తి బదలాయింపు వంటి ప్రక్రియలు సులభమవుతాయన్నారు. క్రమబద్ధీ కరణ చేయించుకోని ప్లాట్లపై భవిష్యత్తులో చట్టపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే ఎల్ఆర్‌యస్‌కు దరఖాస్తు చేసుకుని ఫీజు చెల్లింపులు లేదా అవసరమైన పత్రాల సమర్పణ లో పెండింగ్‌లో ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచిం చారు. పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు, ఎల్‌టిపిలు అందుబాటులో ఉండటంతో దరఖాస్తుదారులు అక్కడికక్కడే తమ సమస్యలను పరిష్కరించుకుని అప్రూవల్ ప్రొసీడింగ్స్ పొందవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆస్తులకు పూర్తి చట్టబద్ధత కల్పించుకోవాలని కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు.

## స్కేటింగ్‌లో ఆసక్తిని పెంపొందించుకోవాలి- రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన స్కేటింగ్ క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు

కర్నూలు స్పోర్ట్స్, మే 13 (శ్రీ చక్ర ) : రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని స్కేటింగ్ రింక్‌లో ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నాడు అభినందన కార్యక్రమం జరిగింది కార్యక్రమంనికి ముఖ్య అతిథులుగా మానవత సంస్థ కన్వీనర్ యాని ప్రతాప్, యాపిల్ బోటిక్ సంస్థ అధినేత ప్రణతి రెడ్డి, జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం సీఈఓ సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ యువతలో స్కేటింగ్ క్రీడపై ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. స్కేటింగ్ ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం అలవడుతుందని పేర్కొన్నారు. కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా కీర్తిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రోలర్ స్కేటింగ్ సంఘం జిల్లా కార్యదర్శి అబుబాకర్, జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘ సహాయ కార్యదర్శులు పునీతా చౌదరి, అనుషా రెడ్డి, సభ్యులు శ్రవంతి, కోచ్‌లు రేనాల్డ్, సురేష్, పి యి టి సురేష్ పలువురు తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# షాక్ సర్క్యూట్ తో కూలీల షెడ్లలో అగ్ని ప్రమాదం

**-పేలిన మూడు డొమెస్టిక్ సిలిండర్లు.. -తప్పిన పెను ప్రమాదం**



మంత్రాలయం,మే 13,(శ్రీచక్ర) : ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయం లోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న శ్రీ నరహరి తీర్థ అథిది గృహం పక్కన ఉన్న కూలీల షెడ్లలో విద్యుత్ షాక్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం సంభవించింది. శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్ ఇతర రాష్ట్రం నుండి కార్మికులను రప్పించి కాపురాలు చేసేందుకు షెడ్లను ఏర్పాటు చేశారు. బుధవారం కూలీలు తమ పనులకు వెళ్లిన తర్వాత జరిగిన ఘటనలో 3 డొమెస్టిక్ సిలిండర్లు పేలి మంటలు చలరేగాయి. విషయం తెలుసుకున్న సిఐ దస్తగిరి బాబు, ఎస్సై మల్లికార్జున సిబ్బందితో ఎస్ ఆర్ ఎస్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సలీం, సిబ్బందితో రాగా విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. మరో పెద్ద సిలిండర్ ను గమనించిన గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది సోమేశ్వర్ ధైర్యంగా సిలిండర్ బయటకు తెచ్చి ప్రమాదాన్ని నివారించారు. ఫైర్ ఇంజన్ కోసం ఎదురు చూడకుండా పోలీసు అధికారులు మంటలను అదుపులోకి తీసుకొచ్చిన అనంతరం ఫైర్ ఇంజన్ వచ్చి షెడ్లలో ఉన్న మంటలను పూర్తిగా ఆర్పివేశారు. షెడ్లలో ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. సీఐ దస్తగిరి బాబు, ఎస్సై మల్లికార్జున పోలీస్ సిబ్బంది తో కలసి చాక చక్యంగా ఎక్కువ పప్రమాదం జరుగకుండా తక్షణ చర్యలు తీసుకోవడంతో ప్రమాదం తప్పింది.

# వరదయ్యపాలెం మండలంలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కలెక్టర్‌కు వినతి



వరదయ్యపాలెం, మే 13 : తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ వరదయ్యపాలెంకు చెందిన గుత్తి త్యాగరాజు జిల్లా కలెక్టర్ కార్యాలయం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఓఖఆూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రజలకు సేవలు ఆలస్యమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అలాగే కడూరు గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజా సేవలు సక్రమంగా అందాలంటే ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని జిల్లా అధికారులను గుత్తి త్యాగరాజు విజ్ఞప్తి చేశారు.

# ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం. ప్రతి మండలంలోనూ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు వివరిస్తూన్న ఎమ్మెల్యే ఆదిమూలం



వరదయ్యపాలెం మే 13(శ్రీ చక్ర) సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుచ్చినాయుడు కండ్రిగలో రూ. 54.80 లక్షలతో బి.పి.హెచ్.యు యూనిట్‌కు శంఖుస్థాపనపేదలకు చేరువగా ఆధునిక వైద్య సేవలుప్రజలందరికీ మెరుగైన ఉచిత వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు సైతం కార్పొరేట్ స్థాయి ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి వేము నిరంతరం కృషి చేస్తున్నామని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు.బుధవారం ఉదయం బుచ్చినాయుడు కండ్రిగ మండల కేంద్రంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు.ఇందులో భాగంగా రూ. 54.80 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదిమూలం శంఖుస్థాపన చేశారు. శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ బి.పి.హెచ్.యు యూనిట్ అందుబాటులోకి రావడం వల్ల మండలంలోని ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ సేవలు స్థానికంగానే లభిస్తాయని తెలిపారుగతంలో చిన్న చిన్న పరీక్షల కోసం కూడా పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై ఆ ఇబ్బందులు తప్పుతాయని ఆయన భరోసా ఇచ్చారు. నిర్ణీత కాలంలోనే ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది, ఎంపిడిఓ, ఆర్ ఐ, వెలుగు ఏపీఎం, మండల స్థాయి అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు ,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎమ్మిగనూరులో వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు,

**లక్షల్లో అక్రమాలు వసూలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, పట్టణంలోని పెస్టిసైడ్స్ షాప్, ఎంటర్ప్రైజెస్ షాప్ ల నుండి ఏటా 20 నుండి 30 లక్షల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నట్టు సమాచారం,**

ఎమ్మిగనూరు, మే, 13 (శ్రీ చక్ర):ఎమ్మిగనూరు పట్టణంలోని మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో సాయంత్రం 6 గంటల సమయంలో వ్యవసాయ శాఖ అధికారి అయిన ఏఈఓ నరసింహులు, కంప్యూటర్ ఆపరేటర్ మోహన్, వీరిద్దరూ అంబేద్కర్ సర్కిల్లో ఉన్న మహాలక్ష్మి ట్రేడర్స్ యజమాని ఈడిగ రంగన్న గౌడ్ లైసెన్స్ కోసం దాదాపుగా లక్ష రూపాయల వరకు డిమాండ్ చేయడంతో ఆయన డబ్బులు ఇచ్చుకోలేని పరిస్థితుల్లో ఉన్న కూడా కచ్చితంగా మాకు డబ్బులు లంచం ఇవ్వాల్సిందే అంటూ వ్యవసాయ శాఖ అధికారులు మొండికేయడంతో ఈడిగ రంగన్న గౌడ్ చేసేదేమీ లేక ఏసీబీ అధికారులను సంప్రదించారు. ఏసీబీ అధికారులు ముందస్తు సమాచారం ప్రకారం లక్ష రూపాయలు డబ్బులను ఈడిగ రంగన్న గౌడ్ చేతిలోకి పెట్టి వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో ఏఈఓ నరసింహులు,కంప్యూటర్ ఆపరేటర్ మోహన్ వీరిద్దరు కలిసి ఈడిగ రంగన్న గౌడ్ దగ్గర నుండి లక్ష రూపాయలు డబ్బులను తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఎసిబి అధికారులు వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో దాడులు చేయడంతో అక్కడనుండి అగ్రికల్చర్ ఏవో శివశంకర్ తప్పించుకున్నారు. పట్టణంలోని పెస్టిసైడ్, ఎంటర్ప్రైజెస్ షాపుల నుండి ఒక సంవత్సరానికి 30 లక్షల నుండి 50 లక్షల రూపాయల వరకు అక్రమంగా వసూలు చేసినట్లు సమాచారం. వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో పాత్రధారి ఏఈఓ నరసింహులు అయితే సూత్రధారి ఏవో శివశంకర్ అని ఎమ్మిగనూరు పట్టణం అంతా కోడై కోస్తున్న మాట వాస్తవమేనని ఏసీబీ అధికారుల దాడులతో వ్యవసాయ శాఖ అధికారుల లంచాలని తేటతెల్లమైనదని చెప్పవచ్చు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి ఇటువంటి అవినీతిపరుల వ్యవసాయ శాఖ అధికారుల పైన విచారణ జరిపి వెంటనే విధుల నుండి సస్పెండ్ చేయాల్సిందిగా పలువురు పెస్టిసైడ్స్ షాప్ యజమానులు కోరుతున్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఇటువంటి అవినీతి అధికారులపై లోతుగా విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలు పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో ఇంత భారీగా అవినీతి వ్యవసాయ అధికారులను ఎప్పుడు కూడా చూడలేదని ప్రజా సంఘాల నాయకులు వాపోతున్నారు. ఏది ఏమైనా వ్యవసాయ శాఖ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను ఏసీబీ అధికారులు పూర్తిగా,లోతుగా విచారణ చేసి ఏఈఓ నరసింహులు, కంప్యూటర్ ఆపరేటర్ మోహన్, లపై పూర్తిగా విచారణ జరిపితే మండల వ్యవసాయ శాఖ అధికారి పేరు బయటికి రావచ్చని ఎమ్మిగనూరు పట్టణమంతా కోడై కూస్తున్న మాట వాస్తవమేనని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు, పెస్టిసైడ్ షాప్, ఎంటర్ప్రైజెస్ షాప్ యజమానులు కూడా గుసగుసలాడుతున్నారు.



# టిడ్కో లబ్ధిదారులందరికి రిఫండ్ చేస్తాం: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**ఏపీ టిడ్కో హౌసింగ్ లబ్ధిదారులకు రిఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, ఇంచార్జి కమిషనర్**




తిరుపతి, మే 13(శ్రీచక్ర): తిరుపతి నగరంలో 2018-19 సంవత్సరంలో ఏపీ టిడ్కో హౌసింగ్ లబ్ధిదారులకు రిఫండ్ చెక్కులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ 2018-19 సంవత్సరంలో ఏపీ టిడ్కో డబుల్ బెడ్ రూమ్ హౌసింగ్ కోసం 2472 మంది లబ్ధిదారుల నుండి దాదాపు 5 కోట్ల రూపాయలను లబ్ధిదారుల వాటా కింద కట్టించుకోవడం జరిగిందని తెలిపారు. అయితే గత ప్రభుత్వం ఏపీ టిట్కో ప్రాజెక్టును రద్దు చేసి లబ్ధిదారులకు వారు కట్టిన రిఫండ్ నగదును తిరిగి ఇవ్వలేదని ఆయన తెలిపారు. లబ్ధిదారులకు రిఫండ్ చెల్లించాలని గత అసెంబ్లీ సమావేశాల్లో తాను మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళినట్లు ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లబ్ధిదారుల ఇబ్బంది చూసి రిఫండ్ కు అంగీకరించారని ఆయన తెలిపారు. లబ్ధిదారులకు రిఫండ్ ఇవ్వడంతోపాటు సెంటు భూమి కూడా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కేటాయించిందని ఆయన చెప్పారు. ఇంచార్జి కమిషనర్ శారద దేవి మాట్లాడుతూ 2472 మంది లబ్ధిదారులకు గాను డబుల్ పేమేంట్స్ పోను 1890 మంది తేలారని చెప్పారు. వీరిలో ఇరవై మంది ఆధార్ కార్డులు సరిపోలేదని ఆమె తెలిపారు. ప్రస్తుతం లబ్ధిదారుల డాక్యుమెంట్ వెరిఫికేషన్ జరుగుతున్నదని ఆమె తెలిపారు. డాక్యుమెంటేషన్ పూర్తయిన వెంటనే మూడు ఫేజ్ లలోని లబ్ధిదారులందరికి ఆన్ లైన్ ద్వారా నేరుగా బ్యాంక్ ఖాతాల్లో రిఫండ్ మొత్తాన్ని జమ చేస్తామని ఆమె చెప్పారు. ఏపీ గ్రీనరీ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏపీ టిడ్కో ప్రాజెక్టు ప్రారంభించామని, అయితే తర్వాత వచ్చిన ప్రభుత్వం దానిని రద్దు చేసిందని దీనితో ప్రస్తుతం వారికి అమౌంట్ రిఫండ్ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మాజీ డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, సూపరింటెండెంట్ రాజశేఖర్, మునిరత్నం రెడ్డి, హౌసింగ్ స్పెషలిస్ట్ డాక్టర్ కాటమరాజు, శ్రావణి, ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు

# ఇంధనాన్ని పొదుపు చేయండి..దేశ పురోభివృద్ధికి పాటు పడాలి

**ప్రధాని మోదీ పిలుపును ప్రతి ఒక్కరూ ఆచరించాలి**



మార్కాపురం మే 13 ( శ్రీ చ(క) వరాంాకప ుంరం: ×పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొనే ప్రమాదం వుందని, ఇలాంటి క్లిష్ట సమయంలో దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన ఇంధన పొదుపు పిలుపును ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించి, దేశ పురోభివృద్ధికి పాటు పడాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కోరారు.ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరుగు తున్న నేపథ్యంలో ఇంధన వినియోగాన్ని తగ్గించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటు అందించవచ్చున్నారు. అవసరం లేని ప్రయాణాలను తగ్గించడం, ప్రజా రవాణా వినియోగాన్ని పెంచడం, పెట్రోల్ మరియు డీజిల్ ను మితంగా వినియోగించడం, ఇంధన పొదుపు పరికరాలను ఉపయోగించడం వంటి చర్యలు ప్రతి కుటుంబం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పటికప్పుడు దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రజల్లో బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందిస్తున్నారని ఆయన గుర్తు చేశారు."ఇంధన పొదుపు అంటే దేశ సంపదను కాపాడటం" అనే భావనతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. భారత్‌ను ఆత్మనిర్భర్ దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, సౌరశక్తి, విద్యుత్ వాహనాలు, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడతాయని అయన తెలిపారు. దేశ ప్రయోజనాల కోసం చిన్న చిన్న అలవాట్లలో పెద్ద పెద్ద మార్పులు తీసుకురావడం ద్వారా ఇంధన పొదుపు కు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ రామచంద్రారెడ్డి కోరారు.

# ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన స్మార కోపన్యాస కార్యక్రమం

మార్కాపురం. మే 13 ( శ్రీ చక్ర)మార్కాపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో యుటిఎఫ్ ఉద్యమ నేత దాచురి రామిరెడ్డి పదవ వర్ధంతి సందర్భంగా స్మారకోపన్యాసం కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మార్కాపురం నందు జిల్లా శాఖ అధ్యక్షులు కాజా రహమతుల్లా అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ మరియు రాష్ట్ర జెవివి నాయకులు అయిన శ్రీ కె ఎస్ లక్ష్మణరావు గారు డి లిమిటేషన్ మహిళా రిజర్వేషన్ మరియు పరిణామాలు అనే అంశంపై స్మారక ఉపన్యాసం చేశారు. భారతదేశంలో స్త్రీ పురుషుల నిష్పత్తి రోజురోజుకీ తగ్గిపోతున్నదని. ప్రతి 1000 మంది పురుషులకు 972 మంది మహిళలు మాత్రమే ఉన్నారని అన్నారు కేరళ మేఘాలయ రాష్ట్రాలలో పురుషుల కంటే స్త్రీలు ఎక్కువగా ఉన్నారన్నారు ఈరోజు మహిళలు సగం మంది ఉపాధ్యాయులు సాఫ్ట్వేర్ ఉద్యోగాలు చేస్తున్నారని కానీ చట్టసభలలో మాత్రం 50% మహిళలు చట్టసభల్లో లేరని అన్నారు రాజ్యాంగంలో 14వ ఆర్టికల్ ప్రకారం చట్టం ముందు అందరూ సమానులే. 2023లో ప్రస్తుత ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టింది లోక్సభ రాజ్యసభ రాష్ట్రపతి ఆమోదం పొందింది 16 వ రాజ్యాంగ సవరణ ఆమోదం పొందాలి . 2024 ఎన్నికలలో అమలు చేసినట్లయితే లోక్సభలోని 543లో 181 మంది మహిళలు ఎన్నికయ్యేవారు కానీ 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఎందుకు ఈ ప్రభుత్వం అమలు చేయలేదు. 2029 సాధారణ ఎన్నికల నాటికైనా అమలు చేయాలని కోరుతున్నాం. డిలిమిటేషన్ అంటే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నియోజకవర్గాల సంఖ్యను పెంచడం సరిహద్దులను మార్చటం అని అర్థం. 2023లో ఆల్రెడీ చట్టమైన ఈ బిల్లు ప్రతిపక్షాలు వ్యతిరేకించడంతో వీగిపోయింది. యుటిఎఫ్ గా మహిళా రిజర్వేషన్లను సమర్థిస్తున్నాము . కానీ






16 వ రాజ్యాంగ సవరణ ప్రకారం జరగాలి డిలిమిటేషన్ కి మహిళా రిజర్వేషన్ కి సంబంధం లేదు. రాజ్యాంగ నిపుణులతో చర్చించాలి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాసరావు హాజరై దాచేరి రామిరెడ్డి ఆశయాల సాధనకు మనం నడుం బిగించడమే మనవారికి ఇచ్చే ఘనమైన నివాళి అని తెలియజేశారు. విద్యారంగ పరిరక్షణ కోసం మనమందరం కూడా మన పాఠశాలల్లో ఎన్రోల్మెంట్తో పెంచుకొని ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని తెలియజేశారు. 12వ పిఆర్సి కమిషన్ వెంటనే వేయాలని ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించవలసిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని నాడు నేడులో మిగిలిపోయినటువంటి పనులను వెంటనే పూర్తి చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరో సీనియర్ నాయకులు మాజీ రాష్ట్ర కార్యదర్శి మీగడ వెంకటేశ్వర్ రెడ్డి గారి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ 1974లో ఏర్పాటు చేయడానికి ఒక ప్రత్యేకత ఉన్నదని ఇంతవరకు ఎంతోమంది నాయకులు వివిధ ప్రాంతాలలో కృషి చేయబట్టి ఈనాడు రాష్ట్రంలో అగ్రగామిగా పేరుందని రాష్ట్రంలోనే ఒక లక్ష మూడు వేల సభ్యత్వం కలిగినటువంటి ఏకైక సంఘం అని అన్నారు. మార్కాపురం జిల్లాలో వివిధ ప్రాంతాలలో యుటిఎఫ్ కోసం కష్టపడుతున్న కార్యకర్తలు అందరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హాజరైన వారు ఎస్.కె అబ్దుల్ హై ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి మాలకొండ రెడ్డి సీనియర్ నాయకులు కృష్ణమూర్తి ఓవి వీరారెడ్డి ఐ వి రామిరెడ్డి పి బాల వెంకటేశ్వర్లు బి శ్రీరాములు ఈ ప్రభాకర్ ఎస్ రాజేశ్వరరావు కె రఫీ సిఐటి జిల్లా నాయకులు అసెంబ్లీ రఫీ జిల్లా కార్యదర్శిలు మండల శాఖ బాధ్యులు సీనియర్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారు ఉదయం 10:30 గంటలకు ఎస్ టి ఎఫ్ ఐ పతాకాన్ని కే శ్రీనివాసరా ఆవిష్కరించారు. యుటిఎఫ్ పథకాన్ని సీనియర్ నాయకులు మేకడ వెంకటేశ్వర్ రెడ్డి పథకావిస్కరణ చేశారు జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి ప్రభాకర్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

## పీఎం సూర్య ఘర్ సోలార్ ప్యానళ్ల.ఏర్పాటు. జులై నెలాఖరు కల పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్



మార్కాపురం మే 13 (శ్రీ చక్ర)మార్కాపురం జిల్లాలో పీఎం సూర్య ఘర్ సోలార్ ప్యానళ్ల ఏర్పాటు లక్ష్యాన్ని జూలై 30 వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత విద్యుత్ శాఖ అధికారులు, ఏజెన్సీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో పీఎం సూర్య ఘర్ లక్ష్యాలపై వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకంపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. మెటీరియల్, కావలసినంత సిబ్బందిని ఏర్పాటు చేసుకొని లక్ష్యానికి అనుగుణంగా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. టార్గెట్లు పూర్తి చేయని ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెడతామని కలెక్టర్ హెచ్చరించారు. సోలార్ ఏర్పాటు వల్ల ఉపయోగాలు, ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు ఈ పథకాన్ని ఉపయోగించుకునే విధంగా చూడాలన్నారు. జనరల్ కేటగిరిలో ఈ లక్ష్యం జిల్లాలో 3వేలు ఉండగా ఇప్పటికీ 169 మాత్రమే పూర్తి చేయడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎస్సీ ఎస్టీలకు రెండు కిలో వాట్ల సామర్థ్యంతోఉచితంగా ఏర్పాటు చేసేసోలార్ ప్యానళ్ల ఏర్పాటు లక్ష్యం 12,342 ఉండగా ఇప్పటికీ 1810 మాత్రమే పూర్తి చేయటం ఏంటని వారిని ప్రశ్నించారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి త్వరితగతిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ కె. వెంకటేశ్వర్లు, మార్కాపురం, కనిగిరి ఈఈ లు నాగేశ్వరరావు, ఉమాకాంత్, ఏడీలు షియా నాయక్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు జిల్లాలో పుష్కర ఘాట్ ల వద్ద చేపట్టిన పనులను వేగవంతం చేయాలి

**భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కర ఘాట్ ల వద్ద పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి**

**కాకినాడ జిల్లా పరిధిలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ తాళ్లరేవు, కాజులూరు మండలాలలోని పుష్కర ఘాట్ లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**









కాజులూరు, మే 13( శ్రీచక్ర)2027 గోదావరి పుష్కరాలకు ముందస్తు సన్నద్ధతలో భాగంగా పుష్కర ఘాట్ ల వద్ద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.రానున్న 2027 గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై బుధవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్.. తాళ్లరేవు, కాజులూరు మండలాల్లో పుష్కర ఘాట్‌లను అధికారులతో కలిసి పరిశీలించారు. తొలుత జిల్లా కలెక్టర్. తాళ్ళరేవు మండలం ఇంజరం గ్రామం, యానం సరిహద్దు ప్రాంతంలో కొత్తగా పుష్కరాల నిమిత్తం ప్రతిపాదించిన అరటికాయ లంక ఘాటును పరిశీలించి, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లంక రెవెన్యూ గ్రామ శివారు గోవలంక పంచాయతీ పరిధిలోగల గోవలంక ఘాట్ ను, గోపులంక రెవెన్యూ గ్రామ పంచాయతీ పరిధిలో గల గోపులంక ఘాట్ ను, తదుపరి పిల్లంక గ్రామ పంచాయతీ పరిధిలో గల పిల్లంక ఘాట్ ను పరిశీలించారు. అచటి నుంచి కాజులూరు మండలం కోలంక గ్రామం శివారు పెద్దలంక పుష్కర ఘాట్ లను జిల్లా కలెక్టర్.. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ ఘాట్ల వద్ద ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు, రహదారి అనుసంధానం, నీటి ప్రవాహం, లోతు పరిస్థితులు, అవసరమైన భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలను జిల్లా కలెక్టర్ అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ పుష్కరాల సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఘాట్ల వద్ద విస్తరణ నిర్మాణ పనులు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, విద్యుత్ వెలుగులు, మరుగుదొడ్లు, పార్కింగ్ ప్రదేశాలు వంటి మౌలిక సదుపాయాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. రానున్న 2027- గోదావరి పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు నిర్దేశించిన గడువు లోపు పూర్తి సన్నద్ధతతో పుష్కర ఘాట్లను అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. పుష్కరాల సమయంలో లక్షలాదిమంది భక్తులకు తరలివచ్చే అవకాశమున్నందున, ప్రతి అంశాన్ని ముందుగానే అంచనా వేసి ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఘాట్ లవద్ద భక్తులు సురక్షితంగా స్నానాలు ఆచరించే విధంగా ర్యాంపులు, చేంజింగ్ రూములు, తాత్కాలికంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఘాట్లకు వెళ్లే ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు పుష్కరాల నాటికి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట రహదారి విస్తరణ, మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రానున్న రోజుల్లో జిల్లాలోని మైనర్ పుష్కర్ ఘాట్ లను కూడా పరిశీలించి, అభివృద్ధి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తాళ్ళరేవు, కాజులూరు మండలం తహసీల్దార్లు పి. త్రినాధరావు, జీ.ఆర్.ఠాగూర్, తాళ్ళరేవు ఎంపీడీవో సత్యనారాయణ, ఇరిగేషన్, ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

## టీడీపీలో కమిటీల లొల్లి...

గుంటూరు, మే 13, టిడిపి లో ఇటీవల రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. జాతీయస్థాయిలో మంత్రి నారా లోకేష్ అదేవిధంగా పలువురు ఎంపీలు కూడా ఉన్నారు. రాష్ట్రస్థాయిలో విస్తృతమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేశారు. తద్వారా నియోజకవర్గాల వారీగా పార్టీని బలోపేతం చేయాలని, వచ్చే ఎన్నికల నాటికి పార్టీ విస్తృతంగా పుంజుకోవాలన్నది ప్రధాన ఉద్దేశం. ముఖ్యంగా వైసీపీకి బలంగా ఉన్న కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో పార్టీని విజయవంతంగా ముందుకు నడిపించేందుకు వీలుగా ఈ కమిటీలు పనిచేయాలన్నది చంద్రబాబు చేసిన దిశా నిర్దేశం. ఈ క్రమంలోనే కొత్తవారికి అదేవిధంగా యువతకు కూడా ప్రాధాన్యం కల్పించారు. వీరికి పార్టీ పరంగా అన్ని విధాల అండదండలు ఉంటాయని కూడా చెప్పారు. అయితే కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి నాయకులు కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీలకు సహకరించటం లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. కొత్తగా నియమించిన నాయకులు ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలకు మధ్య వివాదాలు.. తలెత్తుతున్నాయి. దీంతో కొత్త నేతలు తమ పనులను చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. పేరుకు మాత్రం కొత్తగా నాయకత్వాన్ని నియమించారని, కానీ క్షేత్రస్థాయిలో ఉన్న సీనియర్ నేతలను తమ మాట వినేలా కనీసం సూచనలు చేసేలా ఏమాత్రం దిశా నిర్దేశం చేయకపోవడాన్ని కొత్త నేతలు తప్పుపడుతున్నారు. ఇప్పుడిప్పుడే బాధ్యతలు చేపట్టిన తమకు ఎమ్మెల్యేల నుంచి ఎంపీల నుంచి సహకారం లేకపోతే ఏ విధంగా ముందుకు సాగాలని కూడా క్వశ్చన్ చేస్తున్నారు. ఉదాహరణకు కడప నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవి రెడ్డి కొత్తగా నియమించిన కమిటీలకు ఏమాత్రం సహకరించడం లేదనే వాదన బలంగా వినిపిస్తోంది.అదేవిధంగా అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోనూ ఇదే తరహా పరిస్థితి కనిపిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కొత్తగా నాయకులను నియమించినప్పటికీ వారి ప్రభావం కూడా కనిపించడం లేదు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ పరిస్థితులు తీవ్రతరం అవుతున్న వాతావరణం కనిపిస్తుంది. ఇది కొత్త నాయకత్వానికి ముఖ్యంగా కొత్తగా ఏర్పాటు అయిన నాయకులకు కూడా ఇబ్బందికరంగా పరిస్థితులు తెచ్చేలాగా కనిపిస్తుంది. వీటిని సరిదిద్దాలని కొత్త నాయకత్వం పార్టీ అధిష్టానాన్ని కోరుతోంది.అయితే ఇప్పుడే కమిటీలను ఏర్పాటు చేశామని త్వరలో పుంజుకునే అవకాశం ఉందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చెబుతున్నారు. మరోవైపు రెండు మూడు మాసాల్లోనే స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో అద్భుత విజయాన్ని సొంతం చేసుకోవాలన్న ఉద్దేశంతోనే నూతనంగా కమిటీలను ఏర్పాటు చేశారు. అయితే ఈ లక్ష్యం ఏ మేరకు సాధిస్తారు.. ఏ మేరకు విజయం సాధించగలుగుతారు అనేది కమిటీలు పనిచేసే తీరును బట్టి ఆధారపడి ఉంటుంది. కానీ అసలు పని చేసుకునేందుకు అవకాశం కల్పించే వాతావరణం లేకపోవడం సీనియర్ నాయకులు స్పందించకపోవడం సహకరించకపోవడం అంటూ ఇప్పుడు ప్రధాన సమస్యలుగా మారాయి. వీటిని తక్షణం పరిష్కరించే దిశగా పార్టీ అధిష్టానం దృష్టి పెట్టాలన్నది కొత్తగా ఏర్పడిన కమిటీలు కోరుతున్నాయి. వీటిని పరిష్కారం చేయనంతవరకు తాము ఏ ప్రయత్నం చేసిన వృధా అవుతుందని కొందరు చెబుతున్నారు. మొత్తంగా కొత్త కమిటీలు ఏర్పాటు చేసినప్పటికీ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు మాత్రం కొనసాగుతూనే ఉండడం గమనార్హం.

తెలుగుదేశం పార్టీ

# బీజేపీతో కయ్యమేనా

విజయవాడ, మే 13, పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీతో ఒక రకమైన అప్రకటిత మిత్రత్వం కొనసాగించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు తన రాజకీయ వ్యూహాన్ని సమూలంగా మార్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. పశ్చిమ ఆసియా ఉద్రిక్తతల కారణంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు చేసిన సెవెన్ అప్పీల్స్ పిలుపుపై వైసీపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఇది కేవలం ఒక విధానపరమైన విమర్శ మాత్రమే కాదని, బీజేపీతో తెగతెంపులు చేసుకునే దిశగా పడుతున్న తొలి అడుగు అని విశ్లేషకులు భావిస్తున్నారు.తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన వైసీపీ అధికార ప్రతినిధి పేర్ని, ప్రధాని మోదీపై నేరుగా విమర్శలు గుప్పించారు. ప్రజలకు నీతులు చెప్పే ముందు మోదీ ఆ సూత్రాలను స్వయంగా ఆచరించి చూపాలి అంటూ ఎద్దేవా చేశారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులకు ప్రజలే కారణమన్నట్లుగా ప్రధాని వ్యవహరించడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ముఖ్యంగా బంగారం కొనుగోళ్లు ఆపాలని, విదేశీ పర్యటనలు వాయిదా వేసుకోవాలని చెప్పడం కాదని మోదీ ఆచరించాలన్నారు. తమిళనాడులో సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కజగం సాధించిన విజయం, అక్కడ ఆయన అనుసరిస్తున్న రాజకీయ పంథా జగన్‌ను ఆకర్షించినట్లు కనిపిస్తోంది. విజయ్ నేరుగా రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్‌తో జతకట్టి అక్కడ అధికారంలోకి రావడంతో, జగన్ కూడా అదే తరహా ప్రయోగానికి సిద్ధమవుతున్నారని సమాచారం. బీజేపీ , టీడీపీ,జనసేన ఒకే కూటమిలో ఉండటంతో జగన్ ఇక బీజేపీపై ఆశలు వదులుకున్నట్లు తెలుస్తోంది. చాలా కాలంగా కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉన్న జగన్, ఇప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా ఆ పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బీజేపీ కూటమిని ఢీకొట్టాలంటే కాంగ్రెస్‌తో కలవడమే ఏకైక మార్గమని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. విజయ్ పార్టీని నెత్తికెక్కించుకున్న వైసీపీ సోషల్ మీడియా విభాగాలు కూడా, బీజేపీకి వ్యతిరేకంగా గళం వినిపించడం ద్వారా కాంగ్రెస్ వైపు వెళ్లేందుకు క్షేత్రస్థాయిలో సంకేతాలు పంపుతున్నాయి.రాష్ట్రంలో టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి బలంగా ఉండటంతో, జగన్ ఇక తన పోరాటాన్ని నేరుగా కేంద్రంపైకి మళ్లించాలని నిర్ణయించుకున్నారు. గతంలో విభజన హామీలు, ప్రత్యేక హోదా విషయాల్లో కేంద్రంపై మెతక వైఖరి అవలంబించారనే విమర్శలను చెరిపివేసేందుకు మోదీని నేరుగా టార్గెట్ చేస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇటీవల పార్లమెంట్ లో ప్రత్యేకహోదా అంశాన్ని వైసీపీ ఎంపీలు ప్రస్తావించారు. ప్రధాని మోదీ విఫలమవుతున్నారని వైసీపీ అధికారికంగా ప్రకటించడం అంటే, భవిష్యత్తులో బీజేపీతో దోస్తీకి శాశ్వతంగా ముగింపు పలికినట్లేనని భావించవచ్చు. విజయ్ స్ఫూర్తితో కాంగ్రెస్ వైపు అడుగులు వేయడం ద్వారా జగన్ తన రాజకీయ భవిష్యత్తును వెతుక్కుంటున్నారు.

# 2027 నాటికి పోలవరం పూర్తి

ఏలూరు, మే 13, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పై కీలక అప్డేట్ వచ్చింది. మంత్రి నిమ్మల రామానాయుడు కీలక ప్రకటన చేశారు. 2027 జూన్ నాటికి ప్రాజెక్టు పూర్తవుతుందని.. అదే నెలలో ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్ ను కలిసిన తరువాత మంత్రి రామానాయుడు ప్రకటన చేయడం విశేషం. ఆంధ్రప్రదేశ్కు జీవనాడిగా పోలవరం ప్రాజెక్టును భావిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నత్తనడకన పనులు సాగాయి. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు వేగవంతం అయ్యాయి. ఏడాది కాలంలో పూర్తిస్థాయిలో



అందుబాటులోకి రానుంది పోలవరం. ఎప్పటికప్పుడు మంత్రి నిమ్మల రామానాయుడు పర్యవేక్షిస్తున్నారు. సీఎం చంద్రబాబు సైతం నిత్య పరిశీలనలతో పాటు సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేయిస్తున్నారు. ఏడాది కాలంలో ఈ ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది అని తెలుస్తుండడం మాత్రం శుభ పరిణామం.గోదావరి, కృష్ణా నదులను అనుసంధానిస్తూ ఏలూరు జిల్లా పోలవరం సమీపంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఈ ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. అయితే 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించింది. ప్రారంభంలో రామ పాద సాగర్ గా పిలవబడిన ఈ పథకాన్ని పోలవరం ప్రాజెక్టు గా మార్చారు. 2004లో అధికారంలోకి వచ్చిన రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నదీ ప్రవాహానికి కుడివైపున ఒక స్పిల్ వే నిర్మించారు. ఈ స్టిల్ వేకు అడ్డంగా 48 గేట్లతో ఒక బ్యారేజీ నిర్మాణం చేపడుతున్నారు. నదీ ప్రధాన ప్రవాహానికి అడ్డంగా ఆనకట్ట నిర్మించి.. ఆ ప్రవాహాన్ని కుడివైపున ఉన్న స్కిల్ వేలోకి మళ్ళిస్తారు. ఈ ప్రాజెక్టుకు గేట్లు ఉండవు. కేవలం రాక్ ఫీల్డ్ డ్యామ్ మాత్రమే ఉంటుంది. అయితే ఈ ప్రాజెక్టులో 1118 మీటర్ల పొడవు ఉండే స్పిల్ వే ప్రత్యేకమైనది.దాదాపు 22 సంవత్సరాల కిందట పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. కానీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత మాత్రమే ఈ ప్రాజెక్టుకు గుర్తింపు లభించింది. 2015లో జాతీయ ప్రాజెక్టుగా గుర్తించారు. పోలవరం జాప్యం జరగడంతో పట్టిసీమను తెరపైకి తెచ్చారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. 2015 లోనే దాదాపు 1300 కోట్లు ఖర్చు పెట్టి తొలి విడతగా పూర్తి చేశారు. అయితే మరో ఏడాది కాలంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసి? ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలని భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా పనులు చేయిస్తున్నారు. మరో ఏడాదిలో పోలవరం ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుండడం మాత్రం నిజంగా శుభ పరిణామం.

# త్యాగయ్యలకు దక్కని ఊరట

## పార్టీలు ఏదైనా అంతే

విజయవాడ, మే 13, ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు పలు విషయాలను ప్రస్తావిస్తూ.. ట్రోల్స్ చేస్తున్న విష యం తెలిసిందే. తాజాగా.. పిఠాపురం వర్మకుసంబంధించిన విషయాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నా రు. గత 2024 అసెంబ్లీ ఎన్నికలకు ముందు వర్మ సీటును జనసేనకు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పవన్ కల్యాణ్ విజయం కోసం.. వర్మ కృషి చేశారు. 70 వేల ఓట్లకు పైగా మెజారిటీతో నాడు.. పవన్ కల్యాణ్ గెలుపు గుర్రం ఎక్కారు. ఈ క్రమంలో తన టికెట్‌ను త్యాగం చేసిన వర్మకు.. చంద్రబాబు ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ, అనూహ్య, అనివార్య కారణాలతో చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయలేక పోయారన్నది వాస్తవం. ఇక, ఇటీవల నియోజకవర్గం ఇంచార్జ్ బాధ్యతల నుంచి కూడా వర్మను పక్కన పెట్టారు. అయితే.. ఇక్కడే మరో కీలక విషయం ఉంది. పార్టీ ఇంచార్జ్ బాధ్యతల నుంచివర్మను తప్పించినా.. ఆయనకు రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్ష పదవిని ఇచ్చారు. అంటే.. పార్టీ పరంగా వర్మకు ఇంకా మెరుగైన అవకాశమే ఉంది. కానీ, వైసీపీ నాయకులు మాత్రం వర్మకు ఏదో అన్యాయం జరిగిపోయిందని.. చంద్రబాబు మాట ఇచ్చి కూడా తప్పారని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఒకవేళ ఇదే నిజమని అనుకున్నా.. గతంలో వైసీపీ కూ డా ఇలానే చేసిందన్న విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తించాల్సి ఉంటుంది. చిలకలూరి పేట నియోజకవర్గం నుంచి 2019లో పోటీ చేయాలని భావించిన మర్రి రాజశేఖర్ టికెట్‌ను లాక్కుని విడదల రజనీకి ఇచ్చారు. నిజానికి ఇప్పుడు పిఠాపురం తీసుకోవడం వెనుక టీడీపీకి కూటమి ప్రయోజనాలు ఉన్నాయి. కానీ.. నాడు ఏ ప్రయోజనాలు ఆశించి వైసీపీ మర్రిని త్యాగం చేయాలని పట్టుబట్టింది.? అనే ప్రశ్నకు సమా ధానం లేదు. ఇక, ఆ నాడు.. జగన్ కూడా.. మర్రికి ఎమ్మెల్సీ సహా.. మంత్రి పదవిని కూడా ఆఫర్ చేశారు. నిజానికి చంద్రబాబు వర్మకు మంత్రి పదవి ఇస్తామని చెప్పలేదు. కానీ, ఆనాడు మర్రికి జగన్ మంత్రి పదవి ఇస్తామన్నారు. మరి అధికారంలోకి వచ్చాక ఏం జరిగింది? ఇచ్చారా? అంటే.. నాలుగున్నరేళ్లపాటు మర్రిని ముప్పుతిప్పలు పెట్టారు. చివరకు.. కమ్మ సామాజిక వర్గం ఓట్లు పూర్తిగా డొల్ల అవుతున్నాయని గుర్తించి.. అప్పుడు ఇచ్చారు. సో..నాడు చేసిన విషయాన్ని మరిచిన వైసీపీ ఇప్పుడు టీడీపీకి వంకలు పెడుతుండడమే చిత్రం.

# జగన్ తో దోస్తీ...

## వయా విజయ్ రాహుల్ ప్లాన్


చెన్నై, మే 13, (న్యూస్ పల్స్)వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఇప్పటివరకు బిజెపి పై పల్లెత్తు మాట అనని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక్కసారిగా స్వరం పెంచుకుంది. దేశ ప్రజలు పొదుపు పాటించాలని ఏడు అప్పీల్స్ చేశారు ప్రధాని నరేంద్ర మోడీ. వాటిని జాతీయ మిషన్ గా ప్రకటించారు. అయితే ఇప్పుడు వ్యతిరేకంగా వైసీపీ కామెంట్లు పెడుతోంది. గతంలో కేంద్రం ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా శభాష్ అని పొగిడేవారు జగన్. బిజెపి అడగకుండానే మద్దతు తెలిపేవారు. కానీ ఇప్పుడు సడన్ గా రూటు మార్చింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. హైదరాబాద్ పర్యటనలో ప్రధాని మోదీ పొదుపు మంత్రాన్ని బోధిస్తే.. దానిని తప్పు పడుతూ మాట్లాడారు పేర్ని నాని. ప్రధాని స్థాయి నేతను చులకన చేస్తూ మాట్లాడారు.తమిళనాడులో విజయ్ గెలుపుతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన చేంజ్ కనిపిస్తోంది. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన క్రమంలో సాక్షి మీడియా చూపించిన ప్రత్యేక ఆసక్తి ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. విజయ్ గెలుపును ఒక చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించింది సాక్షి. అంతటితో ఆగకుండా ఆయనకు రాహుల్ గాంధీతో ఉన్న పాత స్నేహాన్ని హైలైట్ చేస్తోంది. అయితే రాహుల్ ను ఎత్తిచూపడం ద్వారా.. ఏపీలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు దిశగా జగన్ ఆలోచన చేస్తున్నారా అనేది ఒక అనుమానం. ఏపీలో జవసత్వాలు లేకుండా ఉంది కాంగ్రెస్ పార్టీ. అయినా సరే ఆ పార్టీకి ఓటు బ్యాంకు ఉంది. మళ్లీ జగన్ రూపంలో పొత్తు పెట్టుకుంటే క్యాడర్ ఉత్సాహంతో పనిచేసి.. ఐదు నుంచి 10% ఓటర్లు యాక్టివ్ అవుతారు. సంప్రదాయ ఓటు బ్యాంకుగా ఉన్న చాలా వర్గాలు తిరిగి యాక్టివ్ అవుతాయి.

# నయా స్టైల్ 'ఎగ్ పులావ్'.. ఇదొక్కడి యాడ్ చేస్తే చాలు టేస్ట్ అద్దిరిపోద్దీ..!



గుడ్డు ఆరోగ్యానికి చాలా మంచిది. గుడ్డులో అనేక పోషకాలు ఉన్నాయి. అందుకే రోజుకో గుడ్డు తినాలని వైద్యులు సూచనలు చేస్తుంటారు. అయితే గుడ్డును అనేకమంది ఉడకపెట్టుకుని, ఫ్రై చేసుకుని తింటారు. మరికొంత మంది ఆమ్లెట్ వేసుకుంటారు. ఇంకొంతమంది ఎగ్ బిర్యానీ చేసుకుంటారు. అయితే గుడ్డుతో సూపర్ టేస్టీ పులావ్ ఎప్పుడైనా ట్రై చేశారా..? ఇలా చేస్తే ఎగ్ పులావ్ చాలా టేస్టీగా ఉంటుంది. మరి ఈ ఎగ్ పులావ్ తయారీకి కావాల్సిన పదార్థాలు ఏంటి..? తయారీ విధానం ఇప్పుడు చూద్దాం.. ఎగ్ పులావ్ తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే కోడిగుడ్లు ఉడకపెట్టినవి ఐదు లేదా ఆరు, బాస్మతి బియ్యం రెండు కప్పులు, బిర్యానీ దినుసులు(షాజీరా, ఆకు, దాల్చిన చెక్క) తగినంత, ఉల్లిపాయలు రెండు పెద్దవి పొడవుగా తరిగినవి, అల్లం, వెల్లుల్లి పేస్ట్ తగినంత, కారం తగినంత, గరం మసాలా పొడి ఒక టేబుల్ స్పూన్, కొత్తిమీర, పుదీనా ఆకులు తగినన్ని, పెరుగు అరకప్పు, ఉప్పు రుచికి సరిపడా, నిమ్మకాయ రసం ఒక టేబుల్ స్పూన్ తీసుకోవాలి. ఎగ్ పులావ్ తయారీ విధానం చూస్తే ముందుగా బియ్యాన్ని కడిగి 30 నిమిషాలపాటు నానబెట్టుకోవాలి. అలాగే గుడ్లను ఉడికించి పొట్టు తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక వెడల్పాటి పాత్రలో నూనె, నెయ్యి వేసి వేడి చేయాలి. బిర్యానీ దినుసులు వేసి వేయించుకోవాలి. ఆ తర్వాత ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేసి బంగారం రంగు వచ్చే వరకూ వేయించుకోవాలి. ఆ తర్వాత అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకూ వేయించాలి. ఆ తర్వాత ఆ మిశ్రమంలోనే పసుపు, కారం, పెరుగు, గరం మసాలా వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఉడికించిన గుడ్లను అందులో వేసి 2 నిమిషాల పాటు మెల్లగా వేయించుకోవాలి. ఎక్కువసేపు వేయించకూడదు. ఆ తర్వాత అందులోనే కొత్తిమీర, పుదీనా వేసి కలుపుకోవాలి. ఇప్పుడు నానబెట్టిన బియ్యాన్ని వేసి 2 నిమిషాలు మెల్లగా కలువుకోవాలి. అందులోనే తగినంత నీళ్లు పోయాలి. రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలిపి మూత పెట్టుకోవాలి. ఇప్పుడు నీరు మరిగి, అన్నం 70 శాతం ఉడికిన తర్వాత మంటను తగ్గించుకోవాలి. అలా 10 నిమిషాల పాటు ఉడికించుకోవాలి. చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేసుకుంటే సరి.. సూపర్ టేస్టీ ఎగ్ పులావ్ రెడీ అయినట్టే..

# గుండె ఆగిపోయేలా చేస్తున్న ఫుడ్స్! 65% మరణాల ముప్పు..




మనం రోజూ ఎంతో ఇష్టంగా తినే చిప్స్, బిస్కెట్లు, కూల్ డ్రింక్స్, ప్యాక్ చేసిన రెడీ-టు-ఈట్ ఆహారాలు (వీటినే అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్ - ఐఖఈ అంటారు) మన ప్రాణాల మీదకు తెస్తున్నాయని తాజా పరిశోధన ఒకటి బాంబు పేల్చింది. యూరోపియన్ కార్డియాలజీ నివేదిక ప్రకారం, ఇవి కేవలం నోటికి రుచి తప్ప ఆరోగ్యానికి అత్యంత హానికరమని తేలింది. వీటిని ఎక్కువగా తీసుకునే వారికి గుండె జబ్బులు, షుగర్, బీపీ రావడమే కాకుండా.. ప్రాణాపాయం కూడా పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా కంపెనీలు తమ ఆహార ఉత్పత్తులు "ఆరోగ్యకరం" అని ప్రచారం చేసుకుంటున్నాయి. కానీ పరిశ్రమల్లో తయారయ్యే ఈ ఆహారాలలో చక్కెర, ఉప్పు, అనారోగ్యకరమైన కొవ్వులు, రసాయనాలు కుప్పలుతెప్పలుగా ఉంటాయి. ఇవి మన శరీరంలోని జీవక్రియలను దెబ్బతీస్తాయి, లోపల మంటను కలిగిస్తాయి మరియు మనల్ని ఇంకా ఇంకా తినేలా ప్రేరేపిస్తాయి. లెక్కలు చెబుతున్న చేదు నిజాలు యూరోపియన్ హార్ట్ జర్నల్ నివేదిక ప్రకారం, ఈ అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్ ఎక్కువగా తినే వారిలో.. గుండె జబ్బుల ప్రమాదం 19% ఎక్కువగా ఉంది. గుండె లయ తప్పే ( ముప్పు 13% ఉంది. గుండె సంబంధిత మరణాల ముప్పు ఏకంగా 65% ఎక్కువగా ఉందని తేలింది. ప్రొఫెసర్ లుయిగినా గుయాస్టీ, డాక్టర్ మారియాలౌరా బొనాషియో వంటి నిపుణుల బృందం ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకోవాలని చెబుతోంది. డాక్టర్ల దగ్గరకు వచ్చే రోగులతో వారు ఏం తింటున్నారు? ఎంతవరకు ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకుంటున్నారు? అనే విషయాలను చర్చించి, వాటిని తగ్గించేలా సలహాలు ఇవ్వాలని సూచించారు. కేవలం పోషకాలను చూడటమే కాదు, ఆహారాన్ని ఎంతగా ప్రాసెస్ చేశారనేది కూడా ముఖ్యమని వారు నొక్కి చెప్పారు. మనం ఏం చేయాలి? యూరప్ దేశాల్లో నెదర్లాండ్స్ (61%), యూకే (54%) వంటి దేశాల్లో జనం తమ ఆహారంలో సగానికి పైగా ఈ హానికరమైన వస్తువులనే తింటున్నారు. అందుకే ప్రభుత్వం కఠినమైన నిబంధనలు తేవాలని, ఆహార పదార్థాల ప్యాకెట్ల మీద స్పష్టమైన లేబుల్స్ ఉండాలని పరిశోధకులు కోరుతున్నారు. సాధ్యమైనంత వరకు తాజాగా వండిన ఆహారాన్ని తీసుకోవడం, ప్యాకెట్లలో దొరికే వస్తువులకు దూరంగా ఉండటమే మన గుండెకు శ్రీరామరక్ష!




# మిల్లెట్ బియ్యం- షుగరు, బీపీ బాధితులకు వరం..!!

ప్రస్తుత కాలంలో ఆహారపు అలవాట్లు వేగంగా మారుతున్నాయి. చిన్న వయసులోనే అనేక కారణా లతో మధుమేహం, బీపీ, గుండె సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వీరికి ఆహారంతో పాటుగా జీవన శైలిలోనూ మార్పులు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. మిల్లెట్స్ ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు అందిస్తాయి. చిరు ధాన్యాలకు పెరుగుతున్న ప్రాధాన్యతకు అనుగుణంగా ఇప్పుడు మిల్లెట్ రైస్ అందుబాటులోకి వచ్చింది. ఈ మిల్లెట్ రైస్ వినియోగం ప్రత్యేకంగా షగరు.. బీపీ బాధితులకు వరంగా మారనుంది. వీటి వినయోగంతో పాటుగా ప్రయోజనాల గురించి నిపుణు లు కీలక సూచనలు అందిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం మిల్లెట్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలని సిఫార్సు చేసింది. తాజాగా.. ఆరోగ్య పరంగా వారానికి కనీసం 3 నుంచి 4 సార్లు చిరుధాన్యాలు తీసుకోవాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) అధ్యయనంలో పేర్కొంది. మధుమేహం, ఊబకాయం నియంత్రణకు చిరుధాన్యాలు సత్ఫలితాలిస్తున్నట్లు వెల్లడించింది. కొర్రలు, రాగి, సజ్జలను ఆహారంగా తీసుకున్న వారి



రక్తంలో గ్లూకోజ్ స్థాయి నియంత్రణతో పాటుగా జీర్ణక్రియ మెరుగవడం .. హిమోగ్లోబిన్ స్థాయిలు పెరిగినట్లు గమనించారు. చిరుధాన్యాలతో ఎనలాగ్ బియ్యం తయారు చేశారు ఐఐఎంఆర్ పరిశోధకులు. అది కేవలం చూడడానికే కాదు, వరన్నంలాగే తెల్లగా, కూరతో కలిపి ముద్దగా చేసుకొని తినడానికి అనువుగా, రుచిగా ఉంటుంది. బిర్యానీ, పులిహోర, పులావ్ లాంటి కమ్మని వంటకాలెన్నో ఎనలాగ్ రైస్‌తో వండుకోవచ్చు. నిపుణుల సూచనలు ప్రస్తుతం 350గ్రాముల ఎనలాగ్ రైస్‌ను రూ. 65కు విక్రయిస్తున్నారు. మిల్లెట్స్‌ను ముందుగా దేనికదే పిండి పట్టించి... దాన్ని మరొక మిషీన్‌ద్వారా ఎక్స్‌ట్రూషన్‌చేయగా బియ్యం గింజల రూపంలోకి వస్తాయి. వాటిని ఆరబెట్టి ప్యాక్ చేస్తున్నారు. చిరుధాన్యాలతో కేకులు, బ్రెడ్, బిస్కెట్లు, కూకీస్, మఫిన్లు, సేమియా, పేలాలు, పాస్తా, న్యూట్రీబార్, కారప్పూస, జంతికలు వంటి రుచికర మైన పదార్థాలు మరెన్నో న్యూట్రీహబ్ లో తయారుచేస్తున్నారు. జొన్న, సజ్జలతో మోడిఫైడ్ పిండిని కొద్దిరోజుల్లో అందుబాటులోకి తేనుంది ఐఐఎంఆర్. చపాతీ కర్రతో ఒత్తుతూ మోడిఫైడ్ పిండితో చాలా తేలిగ్గా రొట్టెలు చేయచ్చు. మిల్లెట్ ఇడ్లీ, పొంగల్, సూప్ రెడీమిక్స్‌లు సైతం భారత చిరుధాన్యాల పరిశోధనా సంస్థ ప్రాంగణంలో లభ్యమవుతాయి. మిల్లెట్ ఉత్పత్తులను తరచూ ఆహారంగా తీసుకోవటం ద్వారా ఆరోగ్యంతో పాటుగా దీర్ఘ కాలిక సమస్యలకు పరిష్కారంగా నిలుస్తుందని నిపుణులు చెబుతున్నారు.

# గుత్తి వంకాయ నిల్వ పచ్చడి: వేడి అన్నంలో తింటే అద్భుతః!



గుత్తి వంకాయతో కూర, స్టఫ్ చేసిన గుత్తి వంకాయ ఇలా రకరకాల కూరలు వండుతూ ఉంటాం . అయితే గుత్తి వంకాయ నిల్వ పచ్చడి మీరు ఎప్పుడైనా చేశారా? చెయ్యకపోతే తప్పకుండా చెయ్యండి. ఈ పచ్చడి చాలా టేస్టీ గా ఉంటుంది. అలాగే ఫ్రిజ్ లో పెట్టుకుంటే ఆరు నెలల పాటు నిల్వ కూడా ఉంటుంది. మరి గుత్తి వంకాయ నిల్వ పచ్చడి ఎలా తయారు చెయ్యాలో తెలుసుకుందాం. గుత్తి వంకాయ నిల్వ పచ్చడి తయారీకి కావలసిన పదార్థాలు వంకాయలు: అర కిలో (చిన్న సైజు లేత గుత్తి వంకాయలు) చింతపండు: 100 గ్రాములు (గుజ్జు తీసి ఉడికించుకోవాలి) కారం: 100 గ్రాములు (రుచికి తగినట్లు) ఉప్పు: రుచికి సరిపడా (సుమారు 80–100 గ్రాములు) మెంతి పొడి: 1 టీస్పూన్ ఆవపొడి: 2 టీస్పూన్లు నూనె: 250 గ్రాములు (వేరుశనగ నూనె అయితే రుచి బాగుంటుంది) పోపు కోసం: ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, వెల్లుల్లి రెబ్బలు, కరివేపాకు, ఇంగువ. తయారీ విధానం ముందుగా వంకాయలను శుభ్రంగా కడిగి, తడి లేకుండా పొడి గుడ్డతో తుడవాలి. వంకాయలకి మధ్యలో ప్లస్ ఆకారంలో గాట్లు పెట్టుకోవాలి. బాణలిలో నూనె వేసి వేడయ్యాక, ఈ గుత్తి వంకాయలను వేసి మగ్గే వరకు (మెత్తబడే వరకు) వేయించి పక్కన పెట్టుకోవాలి పచ్చడికి ప్రధానంగా చెయ్యాల్సింది ఇదే ఆపై అదే పాన్ లో కొద్దిగా నూనె వేసి చింతపండు గుజ్జును పోసి బాణలిలో వేసి దగ్గరపడి నూనె తేలే వరకు ఉడికించాలి.ఒక గిన్నెలో కారం, ఉప్పు, ఆవపొడి, మెంతి పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వేయించిన వంకాయల్లోకి స్టఫ్ చేయాలి. మిగిలిన మసాలా పొడిని ఉడికించిన చింతపండు గుజ్జులో వేసి కలపాలి. అందులోనే స్టఫ్ చేసిన వంకాయలను కూడా వేసి జాగ్రత్తగా కలపాలిపచ్చడి నిల్వ ఉండాలంటే ఇలా చెయ్యాలి ఈ గుత్తి వంకాయ నిల్వ పచ్చడి కోసం బాణలిలో నూనె వేసి ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, వెల్లుల్లి రెబ్బలు, కరివేపాకు, ఇంగువ వేసి వేయించాలి. ఈ పోపు చల్లారిన తర్వాత పచ్చడిలో కలిపేయాలి. ఈ పచ్చడికి తడి తగలకూడదు: పచ్చడి ఎక్కువ కాలం నిల్వ ఉండాలంటే వంకాయలు తడి లేకుండా చూసుకోవాలి.. ఈ పచ్చడిని గాజు సీసాలో భద్రపరుచుకుంటే 3 నుండి 6 నెలల వరకు పాడవకుండా ఉంటుంది. పచ్చడి పైన నూనె తేలుతూ ఉంటే బూజు రాకుండా ఉంటుంది.

# ఇంట్లోనే టేస్టీ టేస్టీ "కాజూ చికెన్ పకోడీ" ఎలా చేయాలంటే !



చికెన్ అంటే చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరికీ ఇష్టమైన వంటకం. సాధారణంగా ఫ్రై, కూర, బిర్యానీలా తరచూ తింటూ ఉంటాం. కానీ ఒక్కసారి కొత్త రుచి ట్రై చేయాలనిపిస్తే... క్రిస్పీగా, బండి స్టైల్‌లో ఉండే జీడిపప్పు చికెన్ పకోడీ మంచి ఆప్షన్. ఈ వంటకం బయట దొరికే టేస్ట్‌ను ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. స్నాక్స్‌గా, పార్టీ స్టార్టర్‌గా కూడా ఇది అద్భుతంగా సరిపోతుంది. కాజూ చికెన్ పకోడీ.. జీడిపప్పు (కాజూ) మరియు మసాలాల కలయికతో ఈ పకోడీకి ప్రత్యేకమైన రుచి వస్తుంది. బయట క్రిస్పీగా, లోపల జ్యూసీగా ఉండటం దీని హైలైట్. పిల్లలు, పెద్దలు అందరూ ఇష్టపడే ఈ రెసిపీ వేడి వేడిగా తింటే మరింత రుచిగా ఉంటుంది. ఈ టేస్టీ రెసిపీ మీకోసం ప్రత్యేకంగా.. కావలసిన పదార్థాలు: చికెన్: 1/2 కేజీ (ఎముకలు లేని చిన్న ముక్కలు అయితే బాగుంటుంది) జీడిపప్పు: 1/2 కప్పు (బద్దలు లేదా ముక్కలు) శెనగపిండి (2 టేబుల్ స్పూన్లు) బియ్యం పిండి (2 టేబుల్ స్పూన్లు – కరకరలాడటానికి) కార్న్ ఫ్లోర్ (1 టేబుల్ స్పూన్). అల్లం వెల్లుల్లి పేస్ట్ (1 టేబుల్ స్పూన్) కారం (1 టేబుల్ స్పూన్) పసుపు (1/2 స్పూన్) ధనియాల పొడి (1 స్పూన్) గరం మసాలా (1/2 స్పూన్) ఉప్పు (రుచికి సరిపడా). నిమ్మరసం (1 టేబుల్ స్పూన్) కరివేపాకు (2 రెమ్మలు) పచ్చిమిర్చి (3–4 చీలికలు). 1 గుడ్డు (దీనివల్ల జీడిపప్పులు ముక్కలకు బాగా అంటుకుంటాయి). నూనె: వేయించడానికి సరిపడా. తయారీ విధానం: చికెన్ ముక్కలను శుభ్రంగా కడిగి నీరు లేకుండా వడకట్టాలి. ఒక గిన్నెలో చికెన్ తీసుకుని అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, కారం, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా, నిమ్మరసం వేసి ముక్కలకు పట్టేలా బాగా కలపాలి. దీనిని కనీసం 1 గంట పాటు పక్కన పెట్టండి (ఫ్రిజ్‌లో పెడితే ఇంకా మంచిది). వేయించే 5 నిమిషాల ముందు, మారినేట్ చేసిన చికెన్‌లో శెనగపిండి, బియ్యం పిండి మరియు కార్న్ ఫ్లోర్ వేయండి.


# లస్సీ చేసే మేలు ఎంతో..!!

వేసవి కాలంలో ఎండ వేడిమిని తట్టుకోవడానికి మనం సాధారణంగా చల్లని పానీయాలను కోరుకుంటాం. శరీరాన్ని డీహైడ్రేషన్ బారి నుండి రక్షించుకోవడానికి అధిక ద్రవాలను, పానీయాలను సేవించడం చాలా అవసరం కూడా. చాలామంది సహజ పానీయాలకు బదులుగా చక్కెరతో నిండిన సోడాలు, ఇతర శీతల పానీయాలను ఇష్టపడతారు. దీంతో పాటు ఇంట్లో లస్సీ తయారుచేసుకుని తాగడం ప్రయోజనకరం. ఇది రుచికరమైనదే కాకుండా, జీర్ణక్రియకు కూడా ఎంతో మేలు చేస్తుంది. వేసవిలో క్రమం తప్పకుండా లస్సీ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను ఇప్పుడు చూద్దాం. వేసవిలో సాంప్రదాయ పానీయాలలో లస్సీ ఒకటి. వేడి వాతావరణంలో శరీరాన్ని చల్లబర్చుకోవడానికి, హైడ్రేట్ చేయడానికి ఇదొక సహజసిద్ధమైన సహాయకారి. లస్సీని సాధారణంగా పెరుగు, నీరు, కొద్దిగా మసాలాలు లేదా చక్కెరతో తయారుచేస్తారు. ఈ పదార్థాలు లస్సీని ప్రోబయోటిక్స్‌కు గొప్ప వనరుగా మారుస్తాయి. ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ద్వారా జీర్ణక్రియకు దోహదపడుతుంది. లస్సీ సహజ శీతలీకరణ శక్తి దీని గొప్ప బలం. వేసవిలో పెరుగు ఆధారిత పానీయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఎందుకంటే అవి చక్కెర అధికంగా ఉండే సోడాలు లేదా కృత్రిమ శీతల పానీయాల కంటే శరీరానికి సున్నితంగా, మరింత రుచిగా ఉంటాయి. తీవ్రమైన వేడి కారణంగా అలసిపోయినప్పుడు, బరువుగా, అధిక వేడిగా అనిపించినప్పుడు ఒక గ్లాసు తేలికపాటి మసాలా లేదా సాధారణ లస్సీ తక్షణ ఉపశమనాన్ని అందిస్తుంది. లస్సీ డీహైడ్రేషన్ నివారణకు అద్భుతంగా పని చేస్తుంది. ఇది నీటితో పాటు, సహజ లవణాలు, కాల్షియం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలను కలిగి ఉంటుంది. ఈ ఖనిజాలు శరీరంలో నీటి సమతుల్యతను కాపాడటం, చెమట పట్టడం వల్ల కలిగే అలసటను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. లస్సీ వల్ల కలిగే మరో ప్రయోజనం ఏమిటంటే, ఇది శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది.



# స్పోర్ట్స్ న్యూస్

## ఐపీఎల్‌లో కోహ్లీ హవా.. ఆడకుండానే ధోనీ మ్యాజిక్, సోషల్ మీడియాలో వీరే టాప్




ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ చివరి దశకు చేరుకోవడంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. ప్లేఆఫ్స్ రేసు మరింత ఆసక్తికరంగా మారడంతో ప్రతి మ్యాచ్ నాకౌట్ తరహాలో సాగుతోంది. మైదానంలో ఆటగాళ్లు సిక్సర్లు, ఫోర్లతో అలరిస్తుంటే.. సోషల్ మీడియాలో అభిమానుల మధ్య ఫ్యాన్ వార్స్ కూడా అదే స్థాయిలో హీట్ పెంచుతున్నాయి. ప్రస్తుతం గుజరాత్ జెయింట్స్ 16 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఆర్సీబీ, ఎస్‌ఆర్‌హెచ్ జట్లు 14 పాయింట్లతో ప్లేఆఫ్స్ బెర్త్ కోసం పోటీ పడుతున్నాయి. మరోవైపు పంజాబ్ కింగ్స్ కూడా 13 పాయింట్లతో గట్టి పోటీ ఇస్తోంది. ఇలాంటి ఉత్కంఠభరిత సమయంలో స్టార్ స్పోర్ట్స్ విడుదల చేసిన తాజా సోషల్ మీడియా డేటా ఆసక్తికర చర్చకు దారితీసింది. మార్చి 28 నుంచి మే 12 వరకు దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో ఎక్కువగా చర్చించబడిన ఆటగాళ్ల జాబితాను స్టార్ స్పోర్ట్స్ విశ్లేషించింది.ఇందులో విరాట్ కోహ్లీ 44 శాతం చర్చలతో అగ్రస్థానంలో నిలిచాడు. కోహ్లీ బ్యాటింగ్, మైదానంలో అతని అగ్రెసివ్ ఆటతీరు ఎప్పటిలాగే అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అయితే అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం ఏమిటంటే.. ఎంఎస్ ధోని ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినా 21 శాతం చర్చలతో రెండో స్థానంలో నిలవడం. టోర్నమెంట్ ప్రారంభానికి ముందే కాలికి గాయమవడంతో ధోనీ ఈ సీజన్‌కు దూరమయ్యాడు. అయినప్పటికీ ఆయనపై అభిమానుల క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. సోషల్ మీడియాలో ఇప్పటికీ ధోనీ గురించే పెద్ద ఎత్తున చర్చ జరుగుతుండటం విశేషం. ఈ జాబితాలో రోహిత్ శర్మ 18 శాతం చర్చలతో మూడో స్థానంలో నిలిచాడు. ఇక సంజూ శాంసన్ 10 శాతం, కేఎల్ రాహుల్ 8 శాతం చర్చలతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు.ఇక యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్‌లో అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఆర్‌ఆర్ తరఫున ఆడుతున్న అతను కేవలం 36 బంతుల్లోనే సెంచరీ సాధించి రికార్డు సృష్టించాడు. అయినప్పటికీ సీనియర్ స్టార్ ఆటగాళ్ల క్రేజ్ ముందు అతనికి టాప్ లిస్టులో చోటు దక్కలేదు. అయితే భవిష్యత్తులో అతను పెద్ద స్టార్‌గా ఎదగడం ఖాయమని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, ధోనీపై బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. త్వరలో ప్రారంభం కానున్న యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో ధోనీ ఆడితే చూడాలని ఉందని అభిషేక్ తన మనసులో మాట బయటపెట్టాడు. దీంతో ధోనీ అభిమానులు మరోసారి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఫిట్‌నెస్‌పై ట్రోలింగ్.. స్మృతి మంధాన స్ట్రాంగ్ కౌంటర్

భారత మహిళా క్రికెట్ జట్టులో స్టార్ ఓపెనర్‌గా గుర్తింపు పొందిన స్మృతి మంధాన మైదానంలో తన బ్యాటింగ్‌తోనే కాదు, ఆత్మవిశ్వాసంతో కూడా అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా తనపై వచ్చిన బాడీ షేమింగ్ కామెంట్స్‌కు ఆమె ఇచ్చిన సమాధానం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఫిట్‌నెస్‌ను ఎగతాళి చేసిన ట్రోలర్లకు స్మృతి ఎంతో కూల్‌గా సమాధానం ఇచ్చారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన స్మృతి, ఒకసారి స్లీవ్‌లెస్ డ్రెస్‌లో కనిపించినప్పుడు తన చేతులకు కండలు ఉన్నాయని కొందరు సోషల్ మీడియాలో ట్రోల్ చేశారని వెల్లడించారు. అయితే ఆ విమర్శలను ఆమె ఏమాత్రం పట్టించుకోలేదని చెప్పారు. “కండలు ఉండటం తప్పు అన్నట్లుగా ట్రోల్ చేయడం చాలా విచిత్రంగా అనిపించింది. నిజానికి ఒక అథ్లెట్‌గా ఫిట్‌గా ఉండటం, శారీరకంగా దృఢంగా ఉండటం గర్వించాల్సిన విషయం” అని ఆమె స్పష్టం చేశారు.జిమ్‌లో గంటల కొద్దీ కష్టపడేది అందంగా కనిపించడానికి మాత్రమే కాదని, ఆరోగ్యంగా మరియు బలంగా ఉండటానికేనని స్మృతి పేర్కొన్నారు మనం ఎంత కష్టపడి ఫిట్‌నెస్‌ను సంపాదిస్తామో తెలుసు. అలాంటి దానిపై గర్వపడాలి కానీ, ఎవరో చేసే కామెంట్లతో బాధపడకూడదు అని ఆమె తెలిపారు. ముంబైకి చెందిన స్మృతి మంధాన చిన్న వయసులోనే క్రికెట్‌లోకి అడుగుపెట్టారు.



కేవలం 16 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఆమె, అప్పటి నుంచి భారత మహిళా జట్టుకు కీలక సభ్యురాలిగా మారారు. ప్రత్యర్థి ఎవరు అన్నది పట్టించుకోకుండా, తన బ్యాట్‌తోనే సమాధానం చెప్పడం ఆమె ప్రత్యేకతగా నిలిచింది.ప్రస్తుతం స్మృతి అద్భుతమైన ఫామ్‌లో కొనసాగుతున్నారు. మహిళా క్రికెట్‌లో అతి పిన్న వయసులో 7,000 అంతర్జాతీయ పరుగులు చేసిన రికార్డు ప్రస్తుతం మెగ్ లానింగ్ పేరిట ఉంది. 29 ఏళ్ల 13 రోజుల వయసులో లానింగ్ ఈ ఘనత సాధించగా, ఇప్పుడు స్మృతి ఆ రికార్డును అధిగమించే దిశగా దూసుకుపోతున్నారు. క్రికెట్‌లో వరుస విజయాలతో పాటు, తన ఆలోచనలతో కూడా యువతకు ప్రేరణగా నిలుస్తున్నారు స్మృతి మంధాన. బాహ్య సౌందర్యం కంటే శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసమే ముఖ్యమని ఆమె మరోసారి నిరూపించింది.

## సన్ రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లపై అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు..

ఐపీఎల్ 2026లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 82 పరుగుల తేడాతో దారుణ ఓడిన సంగతి తెలిసిందే. గుజరాత్ విధించిన 169 పరుగులను ఛేదించే క్రమంలో ఆరెంజ్ ఆర్మీ 86 పరుగులకే కుప్పకూలింది. ఈ నేపథ్యంలో ఎస్‌ఆర్‌హెచ్ జట్టుపై టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక కామెంట్స్ చేశారు. ట్రాఫిక్‌లో కూడా గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వెళ్తామంటే.. ప్రమాదం జరుగుతుందని ఎస్‌ఆర్‌హెచ్ జట్టు అదే పని చేసిందని వ్యాఖ్యానించాడు.ఎస్‌ఆర్‌హెచ్ టాప్ ఆర్డర్ ప్రదర్శనను కారు డ్రైవింగ్‌తో పోల్చాడు. అభిషేక్ బ్యాటింగ్ విధానం గురించి ఈ మాజీ ప్లేయర్ మాట్లాడుతూ.. ‘ఆ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్(అభిషేక్ శర్మ) హైవేపై ఎంత వేగంతో డ్రైవ్ చేస్తాడో, ట్రాఫిక్‌లో కూడా అంతే వేగంతో డ్రైవ్ చేస్తున్నాడు. మీరు హైవేపై గంటకు 100 లేదా 200 కిలోమీటర్ల వేగంతో వెళ్లవచ్చు. కానీ ట్రాఫిక్ జామ్‌లో కూడా అలా నడిపితే, ఎవరో ఒకరు గాయపడతారు. క్రికెట్ అనేది కూడా పరిస్థితులకు తగ్గట్లు ఆడాల్సిన ఆట. అభిషేక్ శర్మ ఒక బంతికి ఒకే పరుగులు తీసి.. ఓ మంచి భాగస్వామ్యాన్ని నిర్మించడం నేను చూడాలనుకుంటున్నాను’ అని తెలిపాడు.ప్రపంచంలోని స్టార్ ఆటగాళ్లందరూ ఎల్లప్పుడూ పిచ్ పరిస్థితులకు తగినట్లుగా తమ ఇన్నింగ్స్‌ను ఎలా ప్లాన్ చేసుకుంటారో, విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మ వంటి వారిని అభిమానులు ఎందుకు ప్రేమిస్తారో, గౌరవిస్తారో ఈ సీనియర్ క్రికెటర్ వివరించాడు. ‘విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాలు పిచ్ పరిస్థితులను అంచనా వేసి.. అందుకు అనుగుణంగా మారతారు కాబట్టే ప్రశంసలు అందుకుంటారు. వారు అన్ని రోడ్లపైనా ఒకే వేగంతో డ్రైవ్ చేయరు. గుజరాత్ మ్యాచ్‌లో ఎస్‌ఆర్‌హెచ్ లక్ష్యాన్ని ఛేజ్ చేయాల్సింది, కానీ టాప్ త్రీ బ్యాటర్లు బాధ్యత తీసుకోకపోవడంతో ఓటమి పాలయ్యారు’ అని అశ్విన్ విశ్లేషించాడు.



## హర్భజన్ సింగ్ సెక్యూర్టీలో 23 మంది సిబ్బంది.. ఆ సంఖ్యపై పంజాబ్ హైకోర్టు అనుమానాలు



చండీఘడ్: భారత మాజీ క్రికెటర్, రాజ్యసభ ఎంపీ హర్భజన్ సింగ్ వద్ద 23 మంది పంజాబ్ పోలీసులు సెక్యూర్టీ సిబ్బందిలో ఉన్నారు. దీనిపై పంజాబ్, హర్యానా హైకోర్టు ప్రశ్నలు లేవనెత్తింది. అంత మంది సిబ్బందిని ఎలా నియమించారని కోర్టు నిలదీసింది. జస్టిస్ జగ్మోహన్ భన్సల్ ఈ కేసులో స్పందించారు. అధికారిక రికార్డుల ప్రకారం కేవలం 8 మంది సిబ్బందికి మాత్రమే అనుమతి ఉందని, కానీ అదనంగా అనధికార రీతిలో మరో 15 మంది పోలీసుల్ని ఎలా కేటాయించారని జస్టిస్ భన్సల్ ప్రశ్నించారు. జిల్లా వారీగా సిబ్బందిపై లెక్కింపు చేయాలని జస్టిస్ భన్సల్ ఆదేశించిన నేపథ్యంలో ఈ విషయం బయటకు వచ్చింది.సెక్యూర్టీ పరిధిలో ఎంత మంది ఉన్నారు, అధికారికంగా లేదా అనధికారికంగా ఎంత మంది సిబ్బంది విధుల్లో ఉన్నారో తెలుసుకోవాలని జస్టిస్ భన్సల్ ఆదేశించారు. సెక్యూర్టీ ఏడీజీపీ, మోఘా జిల్లా ఎస్ఎస్పీకి జస్టిస్ భన్సల్ ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ముందు వేర్వేరుగా అఫిడవిట్లు సమర్పించాలన్నారు. అలాగే పిటీషనర్లకు కానీ, వారి కుటుంబీకులకు కానీ ఎటువంటి హాని జరగవద్దు అని జస్టిస్ భన్సల్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఎంపీల సెక్యూర్టీ ఏర్పాట్లపై పరిశీలిన చేస్తున్న నేపథ్యంలో.. వీఐపీ సెక్యూర్టీ కల్చర్ గురించి కూడా ఆయన ఆరా తీశారు.అయితే ఎంపీ హర్భజన్ అంశంలో రెండు ఆదేశాలు ఉన్నట్లు గుర్తించారు. ఓ ఆదేశం ప్రకారం అధికారికంగా 8 మంది సెక్యూర్టీని కేటాయించారు. ఇక ప్రజాధనం నుంచే అదనంగా 15 మంది పోలీసు సిబ్బందిని అనధికారికంగా విధులకు పంపినట్లు కోర్టు గుర్తించింది. ఈ కేసును మళ్లీ మే 20వ తేదీన విచారించనున్నారు. హర్భజన్ సెక్యూర్టీ అంశంలో అనుమానాలు రావడంతో.. మోఘా జిల్లా మొత్తంలో ఎంత మంది పోలీసులు సెక్యూర్టీ విధుల్లో ఉన్నారో తెలుసుకోవాలని జస్టిస్ భన్సల్ ఆదేశించారు.తన సెక్యూర్టీని అకస్మాత్తుగా తగ్గించారని, తనకు ఉన్న బెదిరింపులను అంచనా వేయకుండా ఆ పని చేశారని, కనీసం తనకు నోటీసు కూడా ఇవ్వలేదని ఎంపీ హర్భజన్ సింగ్ తన పిటీషన్‌లో పేర్కొన్నారు. పంజాబ్ నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ తరపున హర్భజన్ ఎంపీ అయ్యారు. ప్రస్తుతం ఆయన బీజేపీలో చేరారు.

## కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్‌కు 12 లక్షల ఫైన్




అహ్మదాబాద్ : ఐపీఎల్‌లో మంగళవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ జట్టు 82 రన్స్ తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది.అయితే ఆ మ్యాచ్‌లో హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్‌కు జరిమానా పడింది. స్లో ఓవర్ రేటు కారణంగా అతనికి ఫైన్ విధించారు. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అతనికి 12 లక్షల జరిమానా విధించింది. వాస్తవానికి ఈ మ్యాచ్ కేవలం 34.5 ఓవర్లలోనే ముగిసింది. అయినా కానీ కమ్మిన్స్‌కు జరిమాన విధించాల్సి వచ్చింది. ఫస్ట్ బౌలింగ్ చేసిన హైదరాబాద్.. చాలా నెమ్మదిగా బౌలింగ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ జట్టుకు ఇదే తొలి ఉల్లంఘనగా ఐపీఎల్ పేర్కొన్నది. ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం కమ్మిన్స్ ఫైన్ వేస్తున్నట్లు ఐపీఎల్ తన రిలీజ్‌లో చెప్పింది. 169 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు కేవలం 86 పరుగులకే ఆలౌటైంది. జీటీ పేస్ బౌలర్లు ఈ మ్యాచ్‌లో చెలరేగిపోయారు.

## టీ20 ప్రపంచ కప్ 2026: జట్టును ప్రకటించిన ఆస్ట్రేలియా



త్వరలో జరగనున్న మహిళల టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ కోసం క్రికెట్ ఆస్ట్రేలియా జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు కెప్టెన్‌గా స్టార్ ఆల్‌రౌండర్ సోఫీ మోలినెక్స్‌ను ఆసీస్ బోర్డు ఎంపిక చేసింది. అలానే ఆష్లే గార్డ్‌నర్ వైస్ కెప్టెన్‌గా ఎంపికైంది. ఎల్లిస్ పెర్రీ, బెత్ మూనీ, తాలియా మెక్‌గ్రాత్ వంటి స్టార్ ప్లేయర్లు కూడా ఈ జట్టులో చోటు దక్కించుకున్నారు.గతంతో పోలిస్తే భిన్నంగా ఈ సారి సెలెక్టర్లు స్పిన్ బౌలింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇంగ్లండ్ పరిస్థితులకు అనుగుణంగా జార్జియా వేర్హమ్, అలానా కింగ్ వంటి స్పిన్నర్లను ఎంపిక చేశారు. ఫాస్ట్ బౌలర్ డార్సీ బ్రౌన్‌కు ఈ జట్టులో చోటు దక్కలేదు. ఆమె స్థానంలో 20 ఏళ్ల యువ లెఫ్ట్ ఆర్మ్ సీమర్ లూసీ హామిల్టన్‌కు క్రికెట్ ఆస్ట్రేలియా అవకాశం ఇచ్చింది. డబ్ల్యూపీఎల్ ఫ్రాంచైజీ ఆర్సీబీకి చెందిన ముగ్గురు కీలక ప్లేయర్లకు ఈ ఆసీస్ ప్రపంచకప్ జట్టులో చోటు దక్కడం గమనార్హం. హ్యారిస్,పెర్రీ, సోఫీలు గతంలో డబ్ల్యూపీఎల్‌లో ఆర్సీబీ తరఫున ఆడారు.జూన్ 12 నుంచి జులై 5 వరకు జరిగే ప్రపంచకప్‌లో గ్రూప్-1లో ఆస్ట్రేలియా, భారత్, సౌతాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ వంటి పటిష్ఠమైన జట్లు ఉన్నాయి. జూన్ 13న మాంచెస్టర్‌లో దక్షిణాఫ్రికాతో ఆస్ట్రేలియా తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అనంతరం బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, పాకిస్థాన్, భారత్‌తో గ్రూప్ దశలో తలడనుంది. జూన్ 28న లార్డ్స్ మైదానంలో భారత్‌తో జరిగే మ్యాచ్‌పై అందరిలో భారీ అంచనాలు నెలకొన్నాయి.సోఫీ మోలినెక్స్ (కెప్టెన్), ఆష్లే గార్డ్‌నర్ (వైస్ కెప్టెన్), తాలియా మెక్‌గ్రాత్ (వైస్ కెప్టెన్), నికోలా క్యారీ, కిమ్ గార్త్, లూసీ హామిల్టన్, గ్రేస్ హారిస్, అలనా కింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, బెత్ మూనీ (వికెట్ కీపర్), ఎలీస్ పెర్రీ, మేగన్ షట్, అన్నబెల్ సదర్లాండ్, జార్జియా వోల్, జార్జియా వేర్‌హామ్. రిజర్వ్: తాలియా విల్సన్ (వికెట్ కీపర్).




# వరుస ఫ్లాపులతో ముందు జాగ్రత్త

## రెమ్యూనరేషన్ భారీగా తగ్గించుకున్న రవితేజ



మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న రవితేజ, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో వైఫల్య దశను ఎదుర్కొంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, ఆయన తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ, ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి తన నిర్ణయాల్లో మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా రెమ్యూనరేషన్ విషయంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సినిమా కోసం రూ.25 కోట్ల వరకు పారితోషికం తీసుకున్న రవితేజ, ప్రస్తుతం తన రెమ్యూనరేషన్‌ను రూ.15 కోట్లకు తగ్గించుకున్నారని ప్రచారం. నిర్మాతలపై అదనపు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వరుస డిజాస్టర్ల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టు కోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్ చేసిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఇరుముడి' సినిమా కథ, ట్రీట్‌మెంట్, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కు చాలా కీలకంగా మారింది. ఒకవేళ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తే రవితేజ మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.




# ఎన్టీఆర్ –నీల్ ప్రాజెక్ట్ మూవీ

## మే 19న అర్ధరాత్రి గ్లింప్స్ విడుదల





జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఎన్టీఆర్–నీల్' ప్రాజెక్ట్ నుంచి అదిరిపోయే అప్డేట్ రాబోతోంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా కెజిఆఎఫ్, 'సలార్' సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన మాస్ యూనివర్స్‌ను సృష్టించిన ప్రశాంత్ నీల్, ఇప్పుడు తారక్‌ను ఎలా చూపించబోతున్నాడోననే ఆసక్తి అభిమానుల్లో రోజురోజుకీ పెరుగుతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను తారక్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో మే 20న అభిమానులకు భారీ ట్రీట్ ఖాయమని అందరూ భావించారు. అయితే ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం, అభిమానుల ఉత్కంఠను మరింత పెంచేలా మేకర్స్ ఒక రోజు ముందుగానే గ్లింప్స్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అంటే మే 19 అర్ధరాత్రి 12 గంటలకే ఈ ఫస్ట్ గ్లింప్స్ విడుదల కానున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. అర్ధరాత్రి నుంచే సోషల్ మీడియాలో తారక్ ఫ్యాన్స్ సంబరాలు మొదలయ్యే అవకాశముంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన చిన్న చిన్న లీక్స్, సెట్స్ ఫోటోలు అభిమానుల్లో భారీ హైప్ తీసుకొచ్చాయి. ఇప్పుడు ఫస్ట్ గ్లింప్స్‌తో ప్రశాంత్ నీల్ సృష్టించిన కొత్త ప్రపంచం ఎలా ఉండబోతుందో చూడాలని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు మే 18న రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' ట్రైలర్ విడుదల కానుండటంతో సోషల్ మీడియాలో ఇప్పటికే మెగా అభిమానుల హంగామా మొదలైంది. ఇక దానికి మరుసటి రోజే తారక్ గ్లింప్స్ రావడంతో మెగా–నందమూరి అభిమానుల మధ్య సోషల్ మీడియా వార్ పీక్స్‌కు చేరుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాను 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తారక్ నుంచి వస్తున్న ఈ భారీ సోలో ప్రాజెక్ట్ కావడంతో ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక మే 19 అర్ధరాత్రి విడుదలయ్యే గ్లింప్స్‌లో తారక్ లుక్, క్యారెక్టర్, సినిమా బ్యాక్‌డ్రాప్‌పై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.

# విడాకుల జాబితాలో మరో నటి

## భర్తను అన్ ఫాలో చేసిన మౌనీరాయ్


నటి మౌనీరాయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక వార్త కొన్ని రోజులుగా నెట్టింట వైరల్ అవుతోంది. భర్త సూరజ్ నంబియార్‌తో ఆమె విడిపోతున్నట్లు నెట్టింట ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ వార్తలకు బలం చేకూర్చేలా ఇన్‌స్టాగ్రామ్‌లో వీరిద్దరూ ఒకరికొకరు అన్‌ఫాలో చేసుకున్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీ రాయ్ తనకు సంబంధించిన విషయాలను పంచుకుంటూ టూర్స్ ఫొటోలను షేర్ చేస్తుంటారు. కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. అలాగే రూమర్స్‌ను ఇద్దరూ ఖండించకపోవడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. 2022 జనవరిలో తన ప్రియుడు సూరజ్ నంబియార్‌ను మౌనీరాయ్ గోవాలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. మౌనీరాయ్ 'విశ్వంభర'లో ఓ స్పెషల్ సాంగ్ చేసినట్లు సమాచారం.



# కమల్-రజనీ మూవీలో త్రిష




తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**